జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా
పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి
అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్...
రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 172 | హైదరాబాద్, ఏప్రిల్ 14 గురువారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

# వినూత్న బహుజన కార్యక్రమం
# "మీలో ఎవరు లెజెండ్ బహుజన్"
## ప్రశ్న మాది లక్ష మీది పై ప్రశంసల వెల్లువ....



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి) :పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ(అంబేద్కర్ టివి) ఛానల్ లో ప్రారంభమైన వినూత్న బహుజన కార్యక్రమం "మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ప్రశ్న మాది లక్ష మీది" పై ప్రశంసల జల్లు కురుస్తూనే ఉంది.మూడవ రోజు ఈ ప్రోగ్రాం చైర్మన్ ప్రొఫెసర్ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేరేళ్ల కోటేశ్వరరావు, డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు,ప్రొఫెసర్ శ్యామ్ సుందర్ వ్యాఖ్యాతలుగా పాల్గొనగా స్నేహా సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు IRS VRS తో సహా పలువురు బహుజన నాయకులు అతిథులుగా పాల్గొని ఆటలో భాగమవుతూనే బహుజన ఉద్యమంలో తమ భాగస్వామ్యాన్ని తెలియజేశారు. మూడవ రోజు విశేషాలు....

**ప్రముఖ జర్నలిస్ట్ వల్లె రవి కుమార్ మాట్లాడుతూ...**

బహుజనుల చరిత్రలు తెలియజేసి సమాజాన్ని చైతన్యం చేసే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు మాస్టర్ కీ (అంబేద్కర్ టివి) ఛానల్ వారిని అభినందించారు. తాను నల్లగొండ జిల్లా చండూరు మండలం బోడంపర్తి గ్రామంలో కల్లుగీత కార్మికుల కుటుంబం లో జన్మించానని ,తన తండ్రి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారన్నారు.తాను చిన్నతనం లోనే వివక్షకు గురయ్యానని తమ కుటుంబాన్ని మొత్తం గ్రామ బహిష్కరణ గురి చేసారని,తన తండ్రి ధైర్యంగా ఆనాటి పరిస్థితుల ను ఎదుర్కొన్నారన్నారు. బ్రతకడం కోసం కులవృత్తి ని ,సామాజిక చైతన్యం కోసం ఎర్రజెండా ను తన తండ్రి చేతపట్టారన్నారు.తాను మొదట పీపుల్స్ వార్ ఉద్యమానికి ఆకర్షితుడినైనా చదువుపై మక్కువతో జర్నలిజం లోకి వచ్చానని,వ్యక్తిగతంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైన వృత్తి పరంగా పలువురికి సహాయ కారిగా ఉండడం ఆనందంగా ఉందని అన్నారు. అంబేద్కర్ లాంటి మహనీయుల త్యాగాల స్ఫూర్తితో మరింత కష్టపడి పనిచేయాలని పిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ను సాధించడం తనకు సంతోష కరమైన సంఘటన అని, బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా తన పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని తెలిపారు.

**ఓఎన్ జిసి లో ఇంజనీర్ గా పనిచేసిన గంగయ్య మాట్లాడుతూ**

తాను నల్లగొండ జిల్లా చందుపట్ల గ్రామానికి చెందిన వాడినని, వేములపల్లి లో తన విద్యాభ్యాసం మొదలైందని చదువంటే ఇష్టంతో కష్టపడి పనిచేసే వాడినని (మిగతా 2లో..)

# ప్రారంభమైన ప్రాణహిత పుష్కరాలు

**మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో... వైభవంగా ప్రాణహిత నది పుష్కరాలు ప్రారంభం**
**భక్తుల సౌకర్యార్థం పూర్తిస్థాయి ఏర్పాట్లు..: రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి**



మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 13, ప్రజాపాలన : తెలంగాణ, మహారాష్ట్రలో సరిహద్దుల్లో ప్రాణహిత నది పుష్కరాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్, చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్, జిల్లా కలెక్టర్ భారతి హోళ్ళికేరి, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా పరిషత్ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అర్జునగుట్ట పుష్కరఘాట్ వద్ద దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు పుష్కరిణికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రాణహితకు కలశపూజ, గణపతి పూజ, హారతి, విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాణహిత పుష్కరాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. 12 రోజుల కార్యక్రమం కావడంతో శాశ్వత ఏర్పాట్లు చేయలేదని వివరించారు. గతంలో గోదావరి, కృష్ణ పుష్కరాల్లో, ఇప్పుడు ప్రాణహిత పుష్కరాల్లో పుణ్యస్నానం ఆచరించటం మహా భాగ్యంగా భావిస్తున్నాని, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో గోదావరి, కృష్ణ పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు ప్రాణహిత పుష్కరాలను నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ పుష్కరాలకు తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి (మిగతా 2లో..)

# అంబేద్కర్ వల్లే తెలంగాణ వచ్చింది: కేటీఆర్



హైదరాబాద్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బేగంపేటలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పీవీ మార్గ్‌లో 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి ఈ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్రం ఆవిష్కరించబోతోందన్నారు. భారతదేశం మొత్తం గర్వపడే విధంగా మ్యూజియం, జ్ఞానమందిరం ఏర్పాటు చేస్తున్నాం. ఇది భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవబోతుందన్నారు. అంబేద్కర్ తత్వాన్ని మాటల్లో చాలా మంది చెప్తారు. కానీ ఆ తత్వాన్ని కేసీఆర్ ఆకళింపు చేసుకుని ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆ మహానుభావుడు అంబేద్కరే కారణమని కేటీఆర్ చెప్పారు.

## సిద్ధిపేటలోనే తొలి పామాయిల్ ఫ్యాక్టరీ : హరీశ్‌రావు



సిద్ధిపేట : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక మొట్టమొదటి పామాయిల్ ఫ్యాక్టరీని సిద్ధిపేటలోనే స్థాపించినట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రూ.300కోట్లతో 60 ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణా రెడ్డితో కలిసి హరీశ్‌రావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీని (మిగతా 3లో..)



## రేపటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు : గంగుల

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేది లేదని స్పష్టం చేశారు. ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. (మిగతా 2లో..)










# వినూత్న బహుజన కార్యక్రమం "మీలో ఎవరు లెజెండ్ బహుజన్"

## ప్రశ్న మాది లక్ష మీది పై ప్రశంసల వెల్లువ....

(మొదటి పేజీ తరువాయి)



యాదవ కుటుంబానికి చెందిన తనకు చిన్నతనం లో చదువుకోవడానికి కుటుంబం లో ఎవ్వరి సహకారం దొరకలేదని ఐనా ఉదయం పనిచేసి మధ్యాహ్నం చదువుకుని తిరిగి సాయంకాలం పనికి వెళ్ళేవాడినన్నారు.

**ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడుతూ....**

తన స్వగ్రామం ధారూర్ అని చిన్నతనంలో తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాల లోనే విద్యను అభ్యసించానని,తన తండ్రి తాళం చెవి తయారు చేసే వారని, వారాంతపు మార్కెట్ లో పనిచేసే వారన్నారు. ఉదయం, సాయంత్రం కష్టపడి పనిచేస్తూనే తాను చదువుకున్నానని,తన చిన్ననాటినుండే సామాజిక పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు అబ్బాయని, ఎన్ సి సి లో సి సర్టిఫికెట్ పొందానని, ప్యారాచ్యుటర్ గా పనిచేసానన్నారు.

**దళిత స్త్రీ శక్తి నేషనల్ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ....**

తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదికి చెందిన తాను ఎమ్ ఏ ఎల్ ఎల్ ఎం పూర్తి చేసి గుంటూరు బార్ అసోసియేషన్ లో పనిచేశానన్నారు.తన తండ్రి ఉపాధ్యాయుడని, ఆయన అప్పట్లో నక్సల్బరీ ఉద్యమం తో కలిసి పనిచేశారన్నారు. తనకు తన తండ్రి స్ఫూర్తి అని తరువాత తన భర్త అండగా నిలిచారన్నారు.దళిత స్త్రీ శక్తి ఫౌండేషన్ స్థాపించి దళిత, ఆదివాసీ స్త్రీలకు తగిన ప్రాముఖ్యత లభించాలన్న సంకల్పంతో ఈ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. దళిత మహిళ గా ఉద్యమాలు చేయడం కష్టమైనా దృఢ సంకల్పంతో అన్నింటినీ అధిగమించానన్నారు.స్త్రీ గొప్పదనాన్ని చాటడం ఇష్టమని,అందులో దళిత స్త్రీలకు తోడ్పాటునందివ్వడం దళిత స్త్రీ శక్తి ఫౌండేషన్ లక్ష్యమన్నారు.

**ఎం వి ఫౌండేషన్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...**

నల్గొండ జిల్లా నార్కట్ పల్లి వాసినైన తాను చిన్ననాటి నుండి కమ్యూనిస్టు ప్రాబల్యం ఉన్న ఊరు కావడంతో బాల కార్మిక వ్యవస్థ కు వ్యతిరేకంగా 30 సంవత్సరాల క్రితం నుండి పోరాటం చేస్తున్నామని,నేడు ఎం వి ఫౌండేషన్ సేవలు రాష్ట్రం దాటి దేశపరిధిలో కొన్ని లక్షల మంది బాల కార్మికులను చదువుకునేలా చేశామన్నారు. బాల్య వివాహాలపై కూడా పోరాటం సాగిస్తున్నామన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ,మాజీ ఎం ఎల్ ఏ ఆర్ కృష్ణయ్య, డాక్టర్ టివి ఆర్ రామనర్సయ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేరేళ్ల కోటేశ్వరరావు, ప్రొఫెసర్ శ్యామ్ సుందర్, ఇనుగాల భీం రావు, డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు,కోలా జనార్ధన్, ప్రొఫెసర్ డిఎం రవిప్రసాద్, నేరేళ్ల సత్యనారాయణ, పల్లె రవి,కుసుమ భోగరాజు, డాక్టర్ ఎం ఏ షోయబ్,గడ్డం ఝాన్సీ, డాక్టర్ టివి ఆర్ రామనర్సయ్య,పసుల రామ్మూర్తి, ప్రొఫెసర్ వెంకట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికులు బాల్యవివాహాలు తగ్గుముఖం

### వికారాబాద్ ఎంపీడీఓ మల్ల సత్తయ్య

వికారాబాద్ బ్యూరో 13 ఏప్రిల్ ప్రజా పాలన : బాల కార్మికులు బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయని వికారాబాద్ ఎంపీడీఓ మల్ల సత్తయ్య అన్నారు. బుధవారం వికారాబాద్ మండల్ చైల్డ్ లైన్ అడ్వైజరీ బోర్డు సమావేశాన్ని స్థానిక ఎంపిడిఓ సత్తయ్య అధ్యక్షతన ఎంపీడీవో హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మండల గ్రామ స్థాయి సిబ్బంది సహకారంతో చైల్డ్ లైన్ బాగా పని చేసిందని చెప్పారు. మండలంలో గత సంవత్సరంతో పోల్చుకుంటే బాల కార్మికులు బాల్యవివాహాలను తగ్గించగలిగారు అని పేర్కొన్నారు. 100% నిర్మూలనకోసం గ్రామ స్థాయి సిబ్బంది మరింత చైతన్యంతో పనిచేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరగడానికి జెండర్ అసమానతలు గా చూడాలని హితవు పలికారు. సమానత్వం కోసం విద్య ఒక్కటే మార్గమని దీనికోసం బాలికలను మరియు తల్లిదండ్రులను చైతన్యం చేయాలని కోరారు. ఈ సంవత్సరాన్ని బాల్య వివాహాలు జరగని మండలంగా చేయడం కోసం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. దీనికోసం త్వరలోనే అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు గ్రామ కార్యదర్శులు మరియు సర్పంచులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సూచించారు. సి డి పి ఓ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలో బాల్యవివాహాల నిర్మూలన బాలికల ఎదుగుదలలో వచ్చే మార్పులను తెలియజేయుటకు ప్రతి నెల మూడవ శనివారం బాలికల సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ నాగరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ స్వామి జిల్లా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఎంవి ఫౌండేషన్ మండల ఇన్చార్జి వెంకటయ్య హెల్త్ సూపర్వైజర్ మీనాక్షి హాస్టల్ వార్డెన్ పంచాయతీ కార్యదర్శులు చైల్డ్ లైన్ ప్రతినిధి నరసింహులు దేవ కుమారి ఎంవిఎఫ్ సిబ్బంది ఆశాలత ఉమా తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు సత్వర పరిష్కారం: వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల

వికారాబాద్ బ్యూరో 13 ఏప్రిల్ ప్రజా పాలన :: భూ సమస్యల సత్వర పరిష్కారం కొసం మండలాల వారిగా ప్రత్యేక ప్రజాదర్బార్ ఏర్పాటు చేయనున్నామని జిల్లా కలెక్టర్ నిఖిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల స్థాయిలో భూ సమస్యలు పెండింగ్ లో లేకుండా అక్కడికక్కడే పరిష్కరించేందుకు మండలాల వారిగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిఖిల తెలిపారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు భూ సమస్యల పరిష్కారం కొసం ప్రత్యేకంగా మండల స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొసం కార్యాలయాల చుట్టు తిరుగకుండా అక్కడికక్కడే వారి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులైన సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు తదితరులు అందరు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవిన్యూ అధికారులు మండల స్థాయిలో ఉన్న భూ సమస్యలను చిత్తశుద్ధితో అక్కక్కడికక్కడే పరిష్కరించినట్లయితే ప్రజలు కలెక్టర్ కార్యాలయం వరకు రావలసిన అవసరం ఉండదన్నారు. ఈ నెల వికారాబాద్ డివిజన్లో 16న మోమిన్ పేట, 19న నవాబుపేట, 20న దోమ, 21న కోటపల్లి, 22న కుల్కచర్ల, 23న చౌడాపూర్, 26న ధారూర్, 27న మర్పల్లి మండలాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే తాండూర్ డివిజన్ లో ఈనెల 12న పెద్దేముల్, 13న దౌల్తాబాద్, 16న తాండూర్, 19న బషీరాబాద్ మండలాలలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలియజేసినారు.

## ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఎస్సీ, ఎస్టీ ,బీసీ వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందించిన మహెూన్నత వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్



పాలేరు ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి :నేలకొండపల్లి:రాజ్యాంగ ఫలాలు అందించిన మహెూన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఎస్సీ, ఎస్టీ ,బీసీ వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందించిన మహెూన్నత వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి అన్నారు.బుధవారం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132 వ జయంతిని కళాశాలలో రాజనీతి శాస్త్రం మరియు చరిత్ర విభాగాలు సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా,ఉపాధ్యాయునిగా న్యాయవాదిగా ,ఆర్థిక వేత్తగా ఆయన అందించిన సేవలు ఎనలేనివన్నారు.అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులను పొంది భారతదేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్రం, చరిత్ర విభాగాల అధ్యాపకులు ఎన్.ఎం.రఫీ ,డాక్టర్ వెంకట్రాజం, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ మాధవరావు,అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, జానకి రామారావు,సిహెచ్. శ్రీనివాస్, మాధవి,కోటమ్మ, కవిత,కె.శ్రీనివాస్ వాణీ, విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



పాలేరు ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి :నేలకొండపల్లి:రాష్ట్రంలో వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడాన్ని స్వాగతిస్తూ మండల పరిధిలోని పైనంపల్లి గ్రామ సహకార సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు నాగు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచిందన్నారు.అందుకే సీఎం ధాన్యం కొనుగోలుకు సుముఖత వ్యక్తం చేయడం హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విజయ భాస్కర్, డైరెక్టర్లు వెంకట్, రాములు, భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరావు ,కల్వకుంట్ల శీను, గ్రామ రైతు బంధు కన్వీనర్ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ సామేలు, గ్రామ రైతులు నల్లని పుల్లయ్య, మారగాని వీరబాబు, సత్యనారాయణ రెడ్డి,రాఘవరెడ్డి లక్ష్మారెడ్డి, సైదులు ,ఎర్రకోటి ఆవుల వెంకయ్య నారాయణ ,ప్యాక్స్ సిబ్బంది ,సీఈఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### మాస్టర్ కీ(అంబేద్కర్ టీవి) ఛానల్ శాటిలైట్ ఛానల్ గా మార్చటానికి ..

# బహుజనులందరు భాగస్వాములవ్వండి

### స్నేహా సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు పిలుపు



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :బహుజనులకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో పలు వినూత్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్న స్నేహా సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు IRS VRS మాస్టర్ కీ(అంబేద్కర్ టీవి) ఛానల్ శాటిలైట్ ఛానల్ గా మార్చటానికి బహుజనులందరు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఆయన పిలుపునందుకుని బహుజనులు పెద్ద ఎత్తున మాస్టర్ కీ (అంబేద్కర్ టీవి) ఛానల్ లో షేర్లు కొంటుండగా,రెండు తెలుగు రాష్ట్రాల బహుజనులందరూ మాస్టర్ కీ ఛానల్ లో భాగస్వాములు కావాలని, ఇది బహుజనుల ఛానల్ అని,ఏ మీడియా కూడా చూపించని బహుజనుల సమస్యలను చూపిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని, బహుజన మహనీయుల చరిత్రలు ఏ మీడియాలో కూడా చూపించట్లేదని మాస్టర్ కీ(అంబేద్కర్ టీవి) ఛానల్ లో "మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ప్రశ్న మాది లక్ష మీది"అన్న కార్యక్రమం ద్వారా బహుజన మహనీయుల చరిత్రలు,బహుజన నాయకుల పోరాటాలను బహుజనుల ముందుంచడానికి వినూత్న కార్యక్రమం తో ముందుకు వస్తున్నామన్నారు.బహుజనులందరూ 10000 రూపాయల విలువైన షేర్లు కొని మాస్టర్ కీ(అంబేద్కర్ టీవి) ఛానల్ లో భాగస్వాములు కావాలని,ఛానల్ శాటిలైట్ ఛానల్ గా మార్చటానికి బహుజనులందరు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు.

### డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన స్ఫూర్తితో...

# మాస్టర్ కీ ( అంబేద్కర్ టీవీ) టీవీ ఛానల్ ను శాటిలైట్ ఛానల్ గా మార్చటానికి మద్దతు తెలిపిన గురజాల వెంకటశివభాగ్యరాజ్



బాపట్ల, ప్రజాపాలన ప్రతినిధి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 131వ జయంతిని పురస్కరించుకొని "పక్షికి రెక్కలు లేకుంటే ఎగర లేదు . బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు " అని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గారు చెప్పిన విషయాన్ని గుర్తు పెట్టుకొని , దేశంలో అనేక మాధ్యమాలు ఉన్నా దేశానికి దిశా నిర్దేశం చేసిన మహనీయులు మార్గదర్శకులు పూలే, అంబేద్కర్, గౌతమ బుద్ధుడిని ఏ ఒక్క మాధ్యమం లో ప్రదర్శించడం లేదని , బహుజన రాజ్యాధికారం కొరకు నిరంతరం శ్రమించిన బహుజన ఆరాధ్యులు పూలే, అంబేద్కర్, గౌతమ బుద్ధుడు ని తమ చానల్ లో "లోగో" గా చేసుకొని 24 / 7గంటల పాటు ప్రదర్శిస్తూ బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి బహుజన అభివృద్ధికి కృషి చేస్తూ, తద్వారా బహుజన రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మాస్టర్ కీ టీవీ( అంబేద్కర్ టీవీ) ఛానల్ అందరూ కనీసం పదివేల రూపాయలతో విలువ భాగస్వాములు కావాలన్న స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యరావు పిలుపు ను అనుసరించి , బాపట్ల నుండి గురజాల వెంకట శివ భాగ్యరాజ్ ఐదు లక్షల రూపాయల విలువైన మాస్టర్ కి టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో షేర్లు కొనుగోలు చేయటానికి ముందుకు రావడం జరిగింది . "మన సంస్థలను మన మే నిర్మించుకోవాలని "డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాటలను నిజం చేసే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సంకల్పంతో మేము ముందుకు రావడం జరిగిందని పేర్కొన్నారు.

# స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివభాగ్యరావు చేస్తున్న మహాయజ్ఞంలో నేను సైతం...



బాపట్ల, ప్రజాపాలన ప్రతినిధి: మహెూన్నతమైనటువంటి మహా యజ్ఞం చేపట్టిన స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ కటికల శివభాగ్యరావు స్ఫూర్తి ,"మన గొంతుక మన హక్కు" అదేవిధంగా బహుజన రాజ్యాధికారం రావాలంటే మన సంస్థలను మనమే నిర్మించుకోవాలని పిలుపునిచ్చిన డాక్టర్ శివ భాగ్యరావు ఐఆర్ఎస్, వీఆర్ఎస్ యొక్క సంకల్పానికి , నా వంతుగా అంబేద్కర్ టీవీ ఛానల్ శాటిలైట్ ఛానెల్గా మారటానికి నా వంతు మద్దతుగా అంబేద్కర్ 131వ జయంతిని పురస్కరించుకుని ఐదు లక్షల రూపాయల విలువగల షేర్లు కొనగోలు చేశాం. అని గర్వంగా తెలియజేస్తూ ప్రతి బహుజన సోదరులు తమ వంతు గా ,మహనీయుల పేరుతో ఏర్పాటు చేసి నటువంటి అంబేద్కర్ టీవీని ముందంజలో తీసుకురావడంలో మరిముఖ్యంగా శాటిలైట్ చానల్ గా రూపాంతరం చెందే విషయంలో సమిష్టిగా కృషి చేసి మహనీయుల త్యాగాలను మాస్టర్ కీ టివి ఛానల్లో పూలే, అంబేద్కర్, గౌతమ బుద్ధుడుని చానల్ "లోగో" గా చేసుకొని 24 / 7గంటల పాటు బహుజన సమస్య పైన స్పందించే విధంగా ముందుకు రావాలని కోరుకుంటూ డాక్టర్ శివ భాగ్య రావు చేపట్టిన ఈ మహాయజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నాను.

## రేపటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు : గంగుల

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని, రూ.1960 కంటే తక్కువకు కూడా ఎవరూ అమ్ముకోవద్దని సూచించారు. బస్తాల కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని సివిల్ సప్లయ్ అధికారులు, అదనపు కలెక్టర్లు, పోలీసుల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించినట్లు చెప్పారు.

**జూన్ మొదటి వారంలోగా పూర్తి**

ఎల్లుండి నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టి.. మే నెలాఖరు, జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. కేంద్రం బాధ్యతల నుంచి తప్పించుకుందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లిన సమయంలో డ్యాష్ బోర్డులో పేరు కనిపిస్తుందని, రైతు సెల్ఫోన్కు ఓటీపీ వస్తుందని చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాష్ట్రానికి 51 ప్రాంతాల్లో చెక్పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రారంభమైన ప్రాణహిత పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే అవకాశం ఉందని, ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. కృష్ణా, గోదావరి, ప్రాణహిత పుష్కరాల్లో పాల్గొనే అదృష్టం తనకు దక్కిందన్నారు. కుమురం భీం జిల్లా తుమ్మిడిహట్టి వద్ద వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రాణహిత నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే సక్కు, జిల్లా పాలనాధికారి రాహుల్ రాజ్, అదనపు పాలనాధికారి వరుణ్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. యుద్ధప్రాతిపదికన పుష్కరాల ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారుల పనితీరు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దొంగిలించిన వాహనాలు కొన్నా శిక్షార్హులే

- డిసిపి అఖిల్ మహాజన్
- మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్
- 4లక్షల విలువైన 9 బైక్ ల స్వాధీనం

మంచిర్యాల బ్యూరో, ఎప్రిల్13, ప్రజాపాలన: దొంగిలించిన వాహనాలు తక్కువ దరకు వస్తున్నాయని ఎవరైనా కొనుగోలు చేసినా శిక్షార్హుల అవుతారని మంచిర్యాల డిసిపి అఖిల్ మహాజన్ హెచ్చరించారు. బుదవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎసిపి ఏస్.రశ్మి పెరుమాళ్ ఐపీఎస్, పట్టణ సిఐ నారాయణ నాయక్ లతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మోటార్ సైకిల్ ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుని అరెస్టు వివరాలను డిసిపి వెళ్ళండి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేని వాహానాలను విక్రయాలు చేసేవారి చట్టవ్యతిరేకమైన చర్యగా బావించి కేసునమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

**4లక్షల విలువైన 9 బైక్ ల స్వాధీనం**

మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్ వివరాలను డిసిపి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటపెల్లి మండలం మల్లంపేట కు చెందిన కోట రవి మంచిర్యాలపట్టణంలో ని గోపాలవాడలో ఉంటూ ఎలాక్ట్రిషన్ పనిచేసుకుంటూ తక్కువ సమయంలో అదికంగా డబ్బులు సంపాదించాలని బావించి దొంగతనం వృత్తిని ఎంచుకున్నాడు.గత 5 నెలలుగా మంచిర్యాల హాజీపూర్, కాసీపేట్ , మందమర్రి ప్రాంతాలలో తిరుగుతూ పార్క్ చేసిన మోటార్ సైకిల్ లను చూసి తన కు వున్న ఎలక్ట్రిషన్ అనుబవం తో మోటార్ సైకిళ్ వైర్లను కలిపి ఎత్తుకెల్లి అమాయకుల వద్ద కుదవ పెట్టి డబ్బులు సంపాదించుకునేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఇలా తాను హమలివాడ లో దొంగతనం చేసిన మోటార్ సైకిల్ పైనే తిరుగుతూ పార్క్ చేసిన మోటార్ సైకల్ కోసం తిరుగుతు వాహన తనికి లో ఐబి మంచెర్యాల వద్ద పోలీసులకి పట్టు బడ్డాడు. నేరస్థుడు ఇప్పటివరకు దాదాపుగా రూ. 4 లక్షల విలువైన 09 మోటార్ సైకల్ లను దొంగతనము చేసినట్లుగా ఒప్పుకొన్నాడని , వాటిని స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి తెలిపారు.

## ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల వేలం

**జిల్లా ఉద్యాన అధికారి డి. చక్రపాణి**



వికారాబాద్ బ్యూరో 13 ఏప్రిల్ ప్రజా పాలన : ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల వేలం వేయబడిందని జిల్లా ఉద్యాన అధికారి డి. చక్రపాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ12 ఎకరాల మామిడి తోటకు డిప్యూటీ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి డి. చక్రపాణి, ఉద్యాన అధికారులు అరుణ జ్యోతి, ఎం. అర్చన, ఎస్. అంకిత్ కుమార్, కమల, అబ్దుల్ గఫూర్ సమక్షంలో 12 టన్నుల దిగుబడి ఉన్నట్టు అంచనా వేశారు. 13 మామిడి పండ్ల రకాల అక్కడ తోటలో ఉన్నట్టు వారు కొనియాడారు. ఇట్టి మామిడి తోట 2021 సంవత్సరంలో 122,000 గాను వేలం పాట పాడారు. అదే తోటలో ఈ సంవత్సరం కు 15 మంది విక్రయదారులు వేలం పాటలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా నసీరుద్దీన్ వికారబాద్ వాస్తవ్యులు మామిడి తోట వేలం లో416500 రూపాయల కు వేలం పాట పాడి వేలం గెలుచుకున్నారు. వారిని ఉద్యాన శాఖ వారు సత్కరించటం జరిగింది. మునుపటి సంవత్సరం కంటే ఎక్కువ మొత్తంలో లాభాలు మామిడి లో వచ్చినందుకు ఉద్యాన శాఖ వారు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూమిని కబ్జా దారుల నుండి రక్షించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి : తట్టి అన్నారం లో ప్రభుత్వ భూమి రక్షించాలని గత ఆరు నెలలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన పోరాటాల ఫలితంగా సర్వే నిర్వహించడం జరిగింది. కానీ రెవిన్యూ అధికారులు కబ్జాదారులకు భయపడి వారి మోచేతి నీళ్లు అలవాటుపడి సర్వే రిపోర్ట్ ఇవ్వడానికి ప్రభుత్వ భూమిని బయటికి తీయడానికి భయపడుతున్నారు. సర్వే చేసి హద్దులు పాతి న తర్వాత, భూ కబ్జాదారులు హద్దు రాళ్లను తొలగించి కబ్జా చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా స్థానిక కౌన్సిలర్ మున్సిపాలిటీ నుండి ఎటువంటి పర్మిషన్ లేకుండా భారీ కమర్షియల్ షెడ్ నిర్మించి వైన్ షాప్ పెట్టుకుని బిజినెస్ చేస్తున్న, మున్సిపాలిటీ అధికారులు అతనికి భయపడి అక్రమ నిర్మాణాల కోసం లేదు.కల్వర్టును మూసివేసి కల్వర్టు విధిని నిర్మాణాలు చేపట్టి , మున్సిపాలిటీ నిధులు 7 లక్షల తో ఒక వ్యక్తి స్వప్రయోజనం కోసం మున్సిపల్ నిధులను మళ్ళించడం సరికాదని సిపిఎం పార్టీ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఈ నరసింహ హెచ్చరించారు. అక్రమ నిర్మాణం పెరగడానికి, స్థానిక కౌన్సిలర్ నాలలు మూసివేసి అధికారం అండతో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అండతో విచ్చలవిడితనం పెరిగిపోతుంది..వెంటనే ప్రభుత్వ భూమి వెలికితీసి హద్దు రాలు పాదాలని, ఎటువంటి పర్మిషన్ లేకుండా అక్రమ నిర్మాణం చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని ,నాలను, మూసివేసి మున్సిపాలిటీ నిధులతో తీస్తున్న కాలువ ఖర్చులను కౌన్సిలర్ సొంతంగా పెట్టుకుంటే చూడాలని, డిమాండ్ చేయడం జరిగింది. ఇట్టి విషయాలపైన వెంటనే చర్యలు తీసుకోకపోతే రకమైన ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నల్ల ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుండు శివ, నాగేంద్ర, గ్రామ నాయకులు మునిందర్ రెడ్డి సర్వయ్య, సుధాకర్, కాజా మల్లయ్య, వందలాది మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## వరి ధాన్యం కొనుగోలుతో రైతులకు మేలు చేస్తున్న కేసీఆర్



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి :ఈరోజు మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ రైతే రాజు అన్న నినాదంతో తో ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనలేని పరిస్థితిలో మన ముఖ్యమంత్రి కేసీఆర్ రైతే రాజు మన రాష్ట్రంలో యాసంగి లో పండించిన ప్రతి ఒక్క గింజలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామని రైతులు అధైర్య పడవద్దని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వరి ధాన్యం కొనలేక కేంద్రంలో లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పోయినా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి కెసిఆర్ గారు తీసుకున్న నిర్ణయం చాలా సంతోషకరమైన విషయం రాష్ట్రంలో ఉన్న బిజెపి నాయకులు ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేక ఈరోజు బీజేపీ పార్టీ కొనే విధంగా చేశారని దుష్ప్రచారం చేసుకుంటున్నారు బిజెపి వాళ్లు చేసిన కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం రైతులపై కేంద్ర ప్రభుత్వం గతంలో అనేక రైతు వ్యతిరేక చట్టాలను చేసి ఢిల్లీలో రైతుల ఉద్యమాలు చేసి జీర్ణించుకోలేక నల్ల చట్టాలను రద్దు చేసిన దుస్థితి మరిచినట్టు ఉన్నారు తెలంగాణ ప్రభుత్వం కెసిఆర్ ముఖ్యమంత్రి రైతులకు రైతు బీమా రైతుబంధు రైతులకు 10 వేల సహాయం రాష్ట్రంలో రైతులకు ఉచిత కరెంటు ఇస్తున్న కేసీఆర్ ప్రభుత్వం ఇలాంటి ఇలాంటి చాలా కార్యక్రమాలు తీసుకొని ఈ మధ్యకాలంలో కొత్త ప్రాజెక్టులకు కూడా శ్రీకారం చుట్టిన కేసిఆర్ గారి పాలనలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అధ్యక్షులు పి. కృపేష్ అన్నారు అబద్దాలు ప్రచారం చేసుకోవడంలో మన రాష్ట్రంలో బీజేపీ లీడర్ ముందువరుసలో ఉన్నారని ఎద్దేవా చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్ ను చూసి రైతుల పక్షాన నిలబడి నాయకులను గౌరవించే విధంగా నేర్చుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుకల బుగ్గ రాములు మండల ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు చెరుకూరి రవీందర్ .పోచారం ఉపసర్పంచ్ భగీరథ ఎండి రియాజ్ .బాషా తదితరులు పాల్గొన్నారు.

## షర్మిల పోరాటాల ద్వారానే రైతులకు న్యాయం మద్దెల ప్రసాదరావు



మధిర ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి రైతుల సమస్యలపై వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల చేపట్టిన ఉద్యమాల వల్లే రైతులకు న్యాయం జరిగిందని వైయస్సార్ తెలంగాణ పార్టీ దళిత విభాగం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మద్దెల ప్రసాదరావు చింతకాని మండల అధ్యక్షులు వాకా వీరారెడ్డి ముదిగొండ మండల అధ్యక్షులు సామినేని రవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర బుధవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు వైయస్ షర్మిలమ్మ ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మద్దెల ప్రసాదరావు వాకా వీరారెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై వైయస్ షర్మిలమ్మ చేపట్టిన దీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తానని ప్రకటించడం జరిగిందన్నారు. ఇది ముమ్మాటికీ షర్మిలమ్మ విజయమని వారు పేర్కొన్నారు. భగభగ మండే ఎండలను సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలో రాజన్న రాజ్యాన్ని స్థాపించి ఎందుకు వైఎస్ షర్మిల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. అదేవిధంగా రైతు రుణాలను మాఫీ చేయాలని, రైతులకు సబ్సిడీ పై యంత్రాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ గడిపల్లి కవిత ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్ ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గంలో వైయస్సార్ తెలంగాణ పార్టీ గ్రామ కమిటీలు పూర్తి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సారిక కృష్ణ ప్రసాద్ కాశిమాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అంబేద్కర్ 131వ జయంతి వేడుకలను జయప్రదం చెయ్యాలి: గంజికుంట్ల వెంకన్న



పాలేరు ఏప్రిల్ 11 ప్రజాపాలన ప్రతినిధి :పాలేరు నియోజకవర్గం లోభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 131వ జయంతి కార్యక్రమాన్ని జరుపు కొనుటకు గాను,పాలాభిషేకం తో విగ్రహానికి పూలమాలవేసి నివాళులు కల్పించవలసిందిగా కోరుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఆశయ సాధన కోసం మన అందరూ కలిసి కట్టుగా పనిచేయాలనిఈ కార్యక్రమంలో గంజికుంట్ల వెంకన్న,జి.కే దాస్, బట్టపోతుల కిరణ్, అవిటి మధు,కందుల వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు

## సిద్ధిపేటలోనే తొలి పామాయిల్ ఫ్యాక్టరీ : హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధిపేట జిల్లాలో ప్రారంభంకావడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ అపర భగీరథ ప్రయత్నంతో కాళేశ్వరం నీళ్ళు తెచ్చుకున్నామన్నారు. గతంలో కిరణ్‌కుమారెడ్డి మీకు చీకటే.. కరెంటు ఎక్కడ అని అన్నారని.. ఇప్పుడు ఏపీలో చీకటి ఉందని.. సీఎం కేసీఆర్ తెలంగాణలో 24 గంటల కరెంటు ఇచ్చి చూపించారన్నారు. అలాగే ఎకరానికి రూ.10వేల పెట్టుబడి ఇచ్చారన్నారు.








"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేడ్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన

**సంపాదకీయం**

**గురువారం 14, ఏప్రిల్ 2022**


## దళితుల్లో బిజెపి వ్యాప్తిని అడ్డుకోగలరా?

ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ రెండోసారి ఘన విజయం సాధించిన తర్వాత దేశంలో ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడినట్లు కనిపిస్తోంది. యూపీలో ఈసారి జరిగిన ఎన్నికలు అన్ని సామాజిక సమీకరణల్నీ తుత్తునియలు చేశాయి. దళితులు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గు చూపడం, దళితుల పార్టీగా పేరు పొందిన బహుజన సమాజ్ పార్టీ కూడా తెరమరుగయ్యే క్రమం ఏర్పడడం అనేక మంది సామాజిక పండితులను ఆలోచించేలా చేస్తోంది. బిజెపి హిందూత్వ పార్టీ కదా, మనువాద పార్టీ కదా, అగ్రవర్ణాలకు ఆధిపత్యం వహిస్తున్న పార్టీ కదా, అలాంటి పార్టీ దళితులను ఏ విధంగా ఆకర్షించగలుగుతోంది అన్న ఆలోచనల్లో అనేకమంది పడిపోయారు. దళితులను బిజెపి మాయ నుంచి ఏ విధంగా తప్పించాలా అన్న విశ్లేషణలు ప్రారంభించారు. అందులో భాగంగానే ఇటీవల మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు సంపాదకత్వంలో వెలువడిన 'ద దళిత్ ట్రూత్– రీ థింకింగ్ ఇండియా' పేరుతో వెలువడిన పుస్తకం. ఈ పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలోనే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ రాజకీయాల గురించి ప్రస్తావించడం ఆయన దేని గురించి ఆందోళన చెందుతున్నాడో అర్థం అవుతుంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల ముందు తాము మాయావతిని సంప్రదించామని, ఆమెకు ముఖ్యమంత్రి పదవి కూడా ఇస్తామని చెప్పామని, కాని ఆమె మా ప్రతిపాదనలను అంగీకరించలేదని రాహుల్ గాంధీ అన్నారు. 'కాన్షీరామ్ దళితుల గొంతుకు స్ఫూర్తినిచ్చారు. కాని మాయావతి దళితులకోసం పోరాడననే చెబుతున్నారు. బిజెపి ప్రవేశించేందుకు ఆమె స్పష్టంగా దారినిచ్చారు' అని రాహుల్ గాంధీ వాపోయారు. ఇందుకు మాయావతి గట్టి జవాబే ఇచ్చారు. 'రాహుల్ గాంధీ తన పార్టీ గురించి తాను బాధపడాలి కాని మా పార్టీ గురించి ఆయన కెందుకంత బాధ? అయినా మునిగిపోతున్న పడవలో ఎందుకు సవారీ చేయాలి?' అని ఆమె ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ ఓటు శాతం 22 శాతం నుంచి 12.8 శాతానికి పడిపోయిన మాట నిజమే. ఆ పార్టీ తరఫున పోటీ చేసిన 290 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయిన మాట నిజమే. 403 సీట్లున్న యూపీ అసెంబ్లీలో కేవలం ఒక్క సీటు మాత్రమే ఆ పార్టీ గెలుచుకున్న మాట నిజమే. 32 శాతం ఉన్న పంజాబ్‌లో బిఎస్‌పి కేవలం 1.77 శాతం ఓటు శాతం సంపాదించుకున్న విషయం కూడా సత్య దూరం కాదు. అయినా మాయావతి తన గురించి ఇతరులెవరూ బాధపడవద్దంటున్నారు. మునిగిపోతున్న పడవ కాంగ్రెస్ మాత్రమే కాదు, బిఎస్‌పి కూడా. ఇవాళ బిఎస్‌పి దుస్థితికి మాయావతి స్వయంకృతాపరాధాలే కారణం కాదా? మాయావతి హయాంలో బిఎస్‌పిని బహుజన పార్టీ నుంచి సర్వజన పార్టీగా మార్చే ప్రయత్నంలో ఆ పార్టీ తన గుర్తింపును కోల్పోయిందా? దళితుల్లో జాతవుల తర్వాత అణగారిన జాతి అయిన పాసీ వంటి వర్గాలను, యాదవేతర బీసీలను, ముస్లింలను చేర్చుకునేందుకు కాన్షీరామ్ చైతన్యవంతంగా చేసిన ప్రయత్నాలు మాయావతి హయాంలో నీరుకారిపోయాయా? కాంగ్రెస్ సంగతి సరే, భారతదేశంలో దళిత పార్టీలకు ఇక భవిష్యత్ లేదా? దళితులు అగ్రవర్ణాల అధిపత్యంలో ఉన్న రాజకీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందేనా? అన్న ప్రశ్నలు యుపి ఎన్నికలు లేవనెత్తాయి. ఈ ప్రశ్నల విషయంలో మాయావతి జవాబు చెప్పాల్సిన అవసరం ఉన్నది. అయితే మాయావతి కోల్పోయిన స్థలాన్ని భారతీయ జనతా పార్టీ నుంచి సమీప భవిష్యత్‌లో కాంగ్రెస్ సంపాదించుకోగలిగిన స్థితి ఉన్నదా? భారతీయ జనతా పార్టీ విజృంభణ జరగనంత వరకూ, కాన్షీరామ్ ప్రవేశించనంతవరకూ, ప్రాంతీయ పార్టీలు రంగ ప్రవేశం చేయనంతవరకూ ఈ దేశంలో దళితులకు ఆశాకిరణంలా కనిపించిన కాంగ్రెస్ పార్టీ క్రమంగా దళితుల మద్దతు ఎందుకు కోల్పోయింది? అసలు కాంగ్రెస్ పార్టీ కూడా గతంలో నిజంగా దళితులను సమాజంలో ప్రధాన స్రవంతిలో తీసుకువచ్చి, రాజ్యాంగాధికారం కల్పించడం వారి హక్కుగా ఏనాడైనా భావించిందా? దళితులు ఇవాళ బిజెపి వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారు? బిజెపిని మనువాద పార్టీ, హిందూత్వ పార్టీ, అగ్రవర్ణ పార్టీ అని పేర్లు పెట్టి పిలవడం చాలా సులభం. కాని ఈ నిందలేవీ బిజెపిలో చేరుతున్న దళితులు, వెనుకబడిన వర్గాలను అడ్డుకోవడం లేదు. కొప్పుల రాజు సంపాదకత్వం వహించిన పుస్తకంలో ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నాలు అనేకమంది రచయితలు చేశారు. అంబేడ్కర్‌ను రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా నియమించి, రాజ్యాంగాన్ని రూపొందించడానికి కాంగ్రెస్ పార్టీ కారణమైనప్పటికీ, దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారిత కోసం ఎన్ని విధానాలు రూపొందించినప్పటికీ, ఎందరో దళితులు కాంగ్రెస్ నుంచి నేతలుగా ఎదిగినప్పటికీ కాంగ్రెస్ నుంచి దళితులు ఇప్పుడు ఎందుకు దూరమవుతున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం కాంగ్రెస్ పార్టీకి తెలియనిది కాదు. 'రాహుల్ గాంధీ దళితులకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని భావించారు. కాని మా రాష్ట్ర పార్టీల్లో మాత్రం నేతలు దళితులకు అంత ప్రాధాన్యమివ్వడం లేదు. రాజ్యాధికారం వరకు వచ్చే సరికి దళితులను వెనక్కి నెట్టేయడమే జరుగుతోంది..' అని ఇటీవల కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు వాపోయారు. ఒక పార్టీ నేతగా ఉండి, దళితులకు సరైన ప్రాతినిధ్యం కల్పించేందుకు సమూలంగా మార్పులు చేయగలిగిన స్థితిలో లేకపోతే ఎవరైనా ఏమి చేయగలరు? దళితుల త్యాగాలకు విలువ లేకుండా పోతున్నదని కొప్పుల రాజు తన వ్యాసంలో వాపోయారు. సమాజమూ, రాజ్యం అణిచివేస్తున్నా, పేదరికంలో మగ్గిపోతున్నా, తమ శక్తిని దళితులు పూర్తిగా దేశాభివృద్ధికి వినియోగిస్తున్నారని, అయినప్పటికీ వారికి సమాన భాగస్వామ్యం లభించడం లేదని ఆయన అన్నారు. రాజ్యాంగ అసెంబ్లీలోని 15 మంది మహిళా సభ్యుల్లో ఒకరు, దేశంలో తొలి దళిత మహిళా గ్రాడ్యుయేట్ అయిన దాక్షాయణీ వేలాయుధన్ దళితుల కోసం ఆధునిక భారతంలో బలమైన పునాది నిర్మించాలని వాదించినప్పటికీ ఆమె గొంతుక వినపడలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ఎంతో నిజాయితీగా పనిచేసి పదవీ విరమణ తర్వాత ఆర్టీసీ బస్సులో కర్నూలుకు వెళ్లిన దామోదరం సంజీవయ్య కూడా కాంగ్రెస్ విధానాల రూపకల్పనలో కీలక భాగస్వామి కాలేకపోయారు. ఈ దేశంలో దళితుడు ఎంత ప్రముఖుడైనా, రాజ్యాంగ నిర్మాత అయినా అగ్రవర్ణాల చట్రంలో భాగం కాకపోతే, దళితేతర ఓట్లపై ఆధారపడకపోతే రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదని మరో దళిత మాజీ అధికారి రాజశేఖర్ ఉండ్రు తన వ్యాసంలో అన్నారు. రెండుసార్లు లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయిన తర్వాత అంబేడ్కర్ రాజ్యసభకు ఎన్నిక కావల్సి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. అధికార పార్టీల కోసం పనిచేస్తూ తాము అధికారంలో ఉండేందుకు వాటి ప్రయోజనాలను పరిరక్షించాల్సిన దళిత నేతలు ఇతర అణగారిన వర్గాల ప్రయోజనాలను ఏ విధంగా కాపాడగలరు? అని ఆయన విలువైన ప్రశ్న వేశారు.

## "అంబేద్కర్ జన్మదినం సాక్షిగా రిజర్వేషన్లకు తూట్లు"...



మనువాదులు అనాదిగా భూమిపై ఆధిపత్యం కల్గి రాజ్యాలనేలే క్షత్రియ వర్గాన్ని, వ్యాపారం చేసే వైశ్య వర్గాన్ని, రూపాంతరం చెందిన పెట్టుబడిదారీ వర్గాన్ని, వీరికి దుష్ట సలహాల నిచ్చే భూసురులు అనబడే బ్రాహ్మణ వర్గాన్ని, నెత్తికెక్కించుకుని మిగిలిన శూద్రవర్ణాలుగా పిలువబడే నేటి వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలుగా వర్గీకరించబడుతున్న జాతుల (చాతుర్వర్ణ వ్యవస్థలో పాదాల నుండి పుట్టిన వారుగా పిలవబడుతున్నవారు) ను కొద్ది కొద్దిగా అధఃపాతాళానికి తొక్కుతూనే ఉన్నారు. ఈ తెగ ఆది నుండి చిన్న చిన్న ప్రలోభాలకు లొంగిపోతూ, ఏమాత్రం ఐక్యత లేకుండా బానిస వ్యవస్థలో బానిసలుగా బ్రతికారు. నేటి సమాజంలో నిరంతరం పెట్టుబడిదారీ వర్గ పాదాల చెంత చావలేక, బ్రతకలేక బ్రతుకీడుస్తున్నారు. నేటి సమాజంలో 85 % గా ఉన్న ఆ జనాభా అభ్యున్నతి కోసం సమాజంలో వారు సమానావకాశాలు పొందాలని, మిగిలిన 15% గా ఉన్న ఉన్నత వర్గాలతో సమానంగా కలిసి బ్రతకాలనే ఉద్దేశ్యం తోటే బాబా సాహెబ్ అంబేత్కర్ నాయకత్వంలో ఏర్పాటు కాబడిన భారత రాజ్యాంగంలో ఆర్టికిల్ 341 ప్రకారం 1950 నుండి రిజర్వేషన్ విధానం అమలులో ఉంది. గత ప్రభుత్వాలు తమకు ఇష్టమున్నా లేకున్నా , రిజర్వేషన్ లను తొలగించే ధైర్యమూ దమ్మూ లేక కొనసాగించుకుంటు వచ్చాయి. లేకపోతే ఈ సంపన్న వర్గాలతో, వారి తాబేదార్లతో ఏర్పడ్డ ప్రభుత్వాలు ఎప్పుడో తుంగలో తొక్కి ఉండేవి. ఇప్పటి కేంద్రప్రభుత్వం మను వాదుల కోర్కె తీర్చటం కోసం ఒక కొత్త ప్రణాళిక రూపొందించుకుంది. ప్రత్యక్షంగా రిజర్వేషన్లు రద్దు చెయ్యకుండా ప్రభుత్వ రంగ సంస్థల నన్నింటిని ప్రైవేటి కరించే చర్యలకు పూనుకుంది. ప్రభుత్వ రంగ సంస్థలుంటేగదా ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ ఉండడానికి, వాటిని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తే పోలా. ఉద్యోగాల్లో రిజర్వేషన్ ప్రక్రియ మూతపడుతుంది. దానితోపాటు తన తాబేదార్ల నందరిని గుత్త కోటీశ్వర్లను చెయ్యవచ్చు. ఒకే గుండుకు రెండు పిట్టలు అంటే ఇదే.

ప్రభుత్వ ఆస్తుల్ని వారు కొనుగోలు చేసే శక్తి లేకపోయినా అవసరమైతే బాంకుల నుండి అప్పులు ఇప్పించి మరి ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా అంటకట్టే ప్రయత్నాలు కొనసాగు తున్నాయి. దేశంలోని పెట్టుబడిదారులే కాకుండా విదేశీ సంస్థలను కూడా ఆహ్వానించి ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతు న్నారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ ఉక్కు కర్మాగారం విదేశీ సంస్థ పోస్కో కు ధారాదత్తం చేసే ప్రయత్నం ఒక చక్కటి ఉదాహరణ. దేశీయ పెట్టుబడిదారుడు తనలాభాల్ని దేశ సరిహద్దులు దాటించకుండా దేశంలోనే ఇంకొక పరిశ్రమ నెలకొల్పి మరి కొందరికి ఉపాధి కల్పిస్తారని ఆశపడవచ్చు. కానీ విదేశీ సంస్థలు గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ లాగా దేశ సంపదనంత సరిహద్దులు దాటించి మనపై స్వారీ చేసే స్థాయికి రాగలరు. మన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఏ ప్రభుత్వ రంగ సంస్థనైనా నష్టాల ఊబిలోనికి నెట్టి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఇక ప్రభుత్వ రంగ సంస్థలలో రిజర్వేషన్స్ ఎండమావులే. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ముఖ్యంగా ప్రస్తుతం రిజర్వేషన్స్ పొందుతున్న అధిక సంఖ్యాక వర్గం పై ఉన్నది. కొద్దిసేపు జాతి మత వైషమ్యాలను పక్కనపెట్టి కార్యోన్ముఖులు కావలసి ఉన్నది. విద్యా వ్యవస్థ ఇప్పటికే సర్వ నాశనం అయింది. ప్రభుత్వ రంగ విద్యాలయాల్లో ఇప్పటికి రిజర్వేషన్ విధానం కొనసాగుతుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో సరిపడ్డంత ఉపాధ్యాయులను నియమించకుండా వ్యవస్థనే నిర్వీర్యం చెయ్యడం ద్వారా ప్రైవేటు విద్యాలయాలు అభివృద్ధి చెందటానికి దోహదపడుతున్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యాలయాలు మూత పడటం గాని, లేదా ప్రభుత్వ పారిశ్రామిక రంగం ప్రైవేటు సంస్థలుగా మారుతున్నట్టే ప్రైవేటు విద్యా రంగ సంస్థలుగా రూపాంతరం చెందటం గాని జరుగుతుంది. భవిష్యత్ లో రిజర్వేషన్స్ ఉంటాయిగాని ప్రభుత్వ కళాశాలలు, విద్యాలయాలు ఉండవు. అలాగే రిజర్వేషన్స్ ఉంటాయి గాని ప్రభుత్వ రంగ పరిశ్రమలు లుండవు. ఇక రిజర్వేషన్స్ అమలయేదెక్కడ? ఎలా? చదువుతోనే ప్రశ్న ఉద్భవిస్తుంది. చదుకొనేవారు పెరిగేకొద్దీ ప్రశ్నలు పుట్టుకొస్తూనే ఉంటాయి. అందుచేత 85% గా ఉన్న ప్రజానీకానికి చదువుకోడానికి బడులకంటే మతం మత్తులో తేలి ఆడటానికి వీలైన గుడులు కట్టే ప్రయత్నంలో ఉన్నాయి ప్రభుత్వాలు. నేటి ప్రభుత్వాలు ప్రశ్నించేవారన్నా, ప్రశ్నలన్న భయపడి, ప్రశ్నించేవారిని ఏదో కేసుల్లో ఇరికించి జైల్లలో కుక్కి, కేసులు విచారణకు రాకుండా చూస్తున్నారు. చివరకు జైల్లలోనే విచారణ కాలంలోనే చనిపోయేవరకు తెస్తున్నారు. ఇది ఈనాడున్న ప్రభుత్వమే కాదు. గత కాలపు ప్రభుత్వాలు చేశాయి. అయితే ఇటీవల కాలంలో ఇవి బాగా ఎక్కువయ్యాయి. సమాజం గురించి తెలుసుకోనే ముందు నీ గురించి నీవు తెలుసుకో. నీవుసామాన్యునివి కావు. ఆదిమ సమాజం నుండీ నేటివరకూ, నిప్పుని కనిపెట్టిన ప్పటి నుండి నేటివరకు ఈ శ్రమ పరికరాల ఉత్పత్తిలో నీ పాత్ర ఆమోఘమైనది. మడిలో నీవే, బడిలో నీవే, గనిలో నీవే, కర్మాగారంలో నీవే. అందరము తినే తిండిగింజలోనూ నువ్వున్నావు. వాడే వస్తువులో నువ్వున్నావు. "ఇందుగలడం దులేవని సందేహము వలదు. ఎందెందు వెదకి చూసిన అందందే గలవు". మహానుభావా! నీ గురించి తెలుసుకో, నిన్ను నువ్వు ప్రశ్నించుకోవటం మొదలుపెట్టు. సమాజాన్ని ప్రశ్నించు, సమాధానాలు రాబట్టు. ఇంతవరకు ఈ సమాజం నాకేమి చేసిందని కాదు. నేనీ సమాజానికేమిచేశానని ప్రశ్నించుకో. నీశక్తి సామర్థ్యాలు పరీక్షించుకో, అప్పుడు అర్థమవుతుంది. ఇన్నాళ్లు నీవెంత నష్టపోయావో!బాబా సాహెబ్ అంబేత్కర్ పుణ్యమా అని రాజ్యాంగం ద్వారా మనకు సంక్రమించిన ఓటుహక్కు సామాన్యమైంది కాదు. ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థుల తలరాతలు తారు మారు చెయ్యగలిగిన వజ్రాయుధం. దాని విలువ తెలియక, (తెలుసుకోక) రాజకీయాలే వృత్తిగా పెట్టుకొని జీవిస్తున్న పరాన్న జీవుల ప్రలోభాలకు లొంగి, మన ఓటును వారికిచ్చి, వారిచ్చే కాసులు, మద్యం తీసుకొని మన జీవితాల్ని మనమే నరక కూపంలోకి నెట్టుకుంటున్నాము. మనం మారాలనుకోకుండా, మనం మారకుండా ఉన్నన్నాళ్లు ఎన్ని రిజర్వేషన్లు ఉన్న మన జీవితాలు బాగుపడవు.

**బంగారు వి బి ఆచార్యులు**
**98495 79569.**

## జయహో బాబా సాహెబ్ అంబేద్కర్!!

అణగారిన ప్రజలకు ఇలవేల్పు
అట్టడుగు బ్రతుకులకు కోసమెరుపు
అలుపే ఎరుగని నిరంతర శ్రామికుడు
అధ్వాన్నభరిత ఈ సమాజంలో
అందరివాడుగా, అందరికోసం
అన్ని వర్గాల సంక్షేమం కోసం
అణగారిన కులాల విముక్తి కై
అద్వితీయ పోరాటం చేసేందుకు
అతనో ఉదయించిన ధ్రువతార !
అనుక్షణం పుస్తక పఠనంతో
అణువణువునాపై చదువులు చదవాలని
ఆకాంక్షను నింపుకుని

అత్యంత ప్రతిభ కలిగిన మేధస్సు
అలుపే ఎరుగని ధీరత్వంతో
అఖండాలు దాటి విజ్ఞానార్జన చేసి
ఆ విజ్ఞానంతో ఈదేశంలోని
అంటరానితన మనే మైలను
అంట కడిగేసినవైద్యుడు
అందరూ మనుషులేనని
అందరూ సమానమే నని
అందరికీ స్వేచ్ఛ ఉంటుందని
అన్ని దేశాల రాజ్యాంగాలను
అవపోసన పట్టి
అద్భుతమైన రాజ్యాంగాన్ని
ఈదేశానికి రాసిన గొప్ప మేధావి,
సంఘసంస్కర్త, హేతువాది, ఆర్థిక వేత్త,
న్యాయ కోవిదుడు, తత్వవేత్త, రాజ్యాంగ
నిపుణులు, రాజకీయ
నాయకుడు..భారతరత్న..
అతనే బాబా సాహెబ్ భీమ్ రావ్
అంబేద్కర్.

**ఆ మహోన్నత విజ్ఞాన శిఖరానికి**
**131వ జన్మదిన శుభాకాంక్షలు**
**-రవి కుమార్ కంచర్ల.**
**ఫౌండర్ ప్రెసిడెంట్,**
**దళిత విజ్ఞాన వేదిక.**

## దౌత్య విజయం!

రష్యాచమురు కొనుగోలు విషయంలో భారతదేశాన్ని ఫలానావిధంగా వ్యవహరించమంటూ తాము ఎంతమాత్రం కోరలేదని, రష్యా, ఉక్రెయిన్‌లతో ముడిపడిన ప్రతీ అంశంలోనూ భారత్ పూర్తిగా తనకు నచ్చిన నిర్ణయమే తీసుకుంటుందని శ్వేతసౌధం అంటోంది. భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మధ్య జరిగిన వర్చువల్ సమావేశం ఉభయదేశాలనూ మరింత సన్నిహితం చేసిందే తప్ప, దూరాన్ని పెంచలేదని వైట్‌హౌస్ చెబుతోంది. ఉభయదేశాల టూ ప్లస్ టూ మంత్రులస్థాయి చర్చల్లో అమెరికా ఒత్తిళ్ళకు భారత్ తలొగ్గకపోవడం, మనదే పైచేయిగా ఉండటం దేశవాసులను సంతోషపెడుతోంది. రష్యాచమురు కొనుగోలు విషయంలో విదేశాంగమంత్రి జయ శంకర్ కుండబద్దలుకొట్టేయడం విపక్షాల ప్రశంసలనూ అందుకుంది. 'భారత్ కొంటున్న చమురు మీద అంత దృష్టిపెడుతున్న మీరు, ముందు యూరప్ సంగతి చూడండి. ఇంధనభద్రత మా హక్కు. రష్యానుంచి యూరప్ ఓ మధ్యాహ్నంపూట కొంటున్నదానికంటే భారతదేశం నెలకుసరిపడా కొనుక్కుంటున్నది ఎంతో తక్కువ' అని జయశంకర్ జవాబిచ్చారు. ఇక, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ఇచ్చిన వివరణలు, వ్యాఖ్యలు గతంలో చేసినవే. హింస ఆగాలనీ, దౌత్యానికి మద్దతిస్తామనీ, అవసరమైతే మధ్యవర్తిగా ఉంటామనీ మరోమారు ఉద్ఘాటించారాయన. ఇక, రష్యాతో ఆయుధ ఒప్పందాలకు దూరంగా ఉండాలన్న అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ సూచనకుకానీ, భారత్‌లో మానవహక్కుల ఉల్లంఘనలను నిశితంగా గమనిస్తున్నామన్న హెచ్చరికకు కానీ స్పందించాల్సిన అవసరం లేదని భారత్ నిర్ణయించుకుంది. మోదీనీ, భారతదేశాన్నీ విమర్శించడానికి మీకు నోరురావడం లేదా అని ప్రతినిధుల సభకు చెందిన ఇల్హాన్ ఓమర్ ఇటీవల ప్రశ్నించిన నేపథ్యంలో బ్లింకెన్ ఈ అంశాన్ని ప్రస్తావించి ఉండవచ్చు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య విషయంలో భారతదేశ తటస్థ వైఖరిపై అమెరికా ఆచితూచి స్పందిస్తున్నది. భారత్ మీతోనే ఉంటుందా? అని విలేఖరులు వేసిన ప్రశ్నకు బైడెన్ జాగ్రత్తగా సమాధానం చెప్పారు. భారతదేశం బుచా ఊచకోతల తరువాత రష్యాకు వ్యతిరేకంగా బలంగా నిలబడిందని, ఉక్రెయిన్‌కు సాయం చేస్తోందనీ అమెరికా అధికారులే గుర్తుచేస్తున్నారు. చమురు కొనుగోళ్ళను పెంచబోమన్న హామీ ఏమైనా భారత్ నుంచి సాధించారా? అన్న విలేఖరులు ప్రశ్నకు వైట్ హౌస్ సెక్రటరీ ఆ విషయాన్ని మోదీ చూసుకుంటారనీ, రష్యానుంచి ఇండియా కొంటున్నది తన చమురు అవసరాల్లో రెండుశాతం మాత్రమేననీ, అమెరికానుంచి పదిశాతం కొంటున్నదని చెప్పుకొచ్చారు. రష్యాకు వ్యతిరేకంగా తాము విధించిన ఆంక్షలను వమ్ముచేయడానికి ఎటువంటి ప్రయత్నాలు జరిగినా పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ దలీప్ సింగ్ ఇటీవల ఘాటుగా మాట్లాడి భారత్ మనసు నొప్పించిన విషయం తెలిసిందే. ఉభయదేశాలూ తమకు సమష్టిలక్ష్యాలున్నాయనీ, వాటిని సాధించాలన్న దృఢ సంకల్పం ఉన్నదని ప్రకటించుకొని రక్షణసహా పలు కీలకరంగాల్లో సహకారాన్ని కాంక్షించాయి. రక్షణ ఉత్పత్తుల తయారీలో అమెరికా కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టాలని భారత్ కోరుతోంది. రష్యానుంచి ఆయుధాల కొనుగోలు తగ్గించుకొనే పక్షంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు సిద్ధమని అమెరికా అంటోంది. అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి అంశాల్లోనూ, ప్రాంతీయస్థాయిలో శాంతి సుస్థిరతలను కాపాడే విషయంలోనూ మరిన్ని అడుగులువేయాలనుకున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో విడుదల చేసిన సంయుక్త ప్రకటన భారత్‌కు ఇబ్బంది కలిగించని రీతిలో ఉంటూ ప్రధానంగా అమెరికాకు ఆత్మసంతృప్తిని ఇస్తుంది. సామాన్యుల మరణాలను ఖండించడం, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలనడం, ఆయా దేశాల సమగ్రతనీ, సార్వభౌమత్వాన్నీ గౌరవించాలనడం మంచిదే. ఉక్రెయిన్ యుద్ధం వల్ల కొన్ని మనస్పర్థలు పుట్టుకొచ్చినా, భారత్ అమెరికా బంధం ఇకపై మరింత బలపడేదే తప్ప పలుచనకాబోదని అమెరికా వాదన. నాలుగోవిడత టూ ప్లస్ టూ సమావేశంతో పాటు బైడెన్ మోదీ మనసు విప్పి మాట్లాడుకోవడం, ఉభయదేశాల బంధానికీ పునాదులు వేసిన నెహ్రూ ట్రూమన్ భేటీని ఈ సందర్భంగా బ్లింకెన్ తలుచుకోవడం గమనించినప్పుడు, భారత్ మనసు మరింత గెలుచుకోవాలన్న అమెరికా ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది.

## మహనీయుల విగ్రహాలకు అలంకరణ మరిచిన ప్రభుత్వం...

హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :మహాత్మ జ్యోతీబా పూలే ,బాబా సాహేబ్ అంబే ద్కర్ విగ్రహాలకు వర్ధంతి,జయంతిల కు కనీసం కలర్ వేసి పువ్వులతో అలంకర ణ చేయటం ప్రభుత్వం మరచిపోవడం బాధాకరం అన్నారు అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి సి. యల్. యాదగిరి.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నుండి టి ఆర్ ఎస్ ప్రభుత్వం వరకు మహనీయుల ప్రతిమలకు కలర్ వేసి పువ్వులతో అలంకారం చేసేవాళ్ళని. గత రెండు సంవత్సరాల నుండి కరోన మహమ్మారి వల్ల ఎవరూ అలంకరణ చేయట్లేదన్నారు..ఈ సంవత్సరం కూడ చేయలేమని బడ్జేట్ లేదని మున్సి పల్ అధికారులు చెపుతున్నారన్నారు. టి ఆర్ ఎస్ , ప్రభుత్వం ప్రతి సంవత్సరం లక్ష ల రూపాయల బడ్జెట్ మంజూరు చేస్తున్నారన్నారు.అల్వాల్ సర్కిల్ లో ఉన్న మహనీయుల విగ్రహాలకు కలర్స్ ,పువ్వుల అలంకరణ చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నుండి కూకట్ పల్లి జాయింట్ కమిషనర్ వి.మమ త కి, అల్వాల్ డిప్యూటీ కమిష నర్ కవితకి,డివిజన్ల కార్పొరేటర్లకువినతి పత్రాల ద్వార తెలియ జేశామన్నారు. జిహెచ్ఎంసీ అధికారులు, స్పందించకు%శీ%టే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మల్కాజ్ గిరి మైనంపల్లి హన్మంత్ రావు , ముగ్గురు టీ.ఆర్.ఏస్,133,134,135, డి విజన్ల కార్పొరేటర్లు పట్టించుకోక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించట్లేదన్నారు ? అన్న సామెత గా అధికారుల తీరు ఉందన్నారు. దీనిపై మున్సిపల్ శాఖ మంత్రి కే. టి.రామారావు స్పందించి తగిన చర్య తీసుకోవాలని వీజ్ఞప్తీ చేశారు. ఈ కార్యక్రమంలో జి . రాజయ్య ,టి.యాదలయ్య ,ఆర్.బాలరాజు,అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, సి.యల్. క్రిష్ణా, లింగాల శంకర్, బి.రామ కృష్ణ ,దప్పు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్రేపల్లిలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన

### కౌన్సిలర్ పల్గుట్ట ప్రవళిక కృష్ణ



వికారాబాద్ బ్యూరో 13 ఏప్రిల్ ప్రజా పాలన : డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ 131 వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధిలోని కొత్రేపల్లిలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగిందని కౌన్సిలర్ పల్గుట్ట ప్రవళిక కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించామని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను కొత్రేపల్లిలో ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. గ్రామ యువకులు ఉత్సాహంతో సంతోషంతో విగ్రహ ప్రతిష్టాపన లో భాగస్వాములు అయ్యారని వివరించారు. నేటి యువతీ యువకులు అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు భారత రాజ్యాంగ నిర్మాత దశదిశ సూచించిన మహనీయుని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అంబేద్కర్ జయంతి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుటకు గ్రామస్తులంతా కదలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యువజన సంఘం సభ్యులు పల్గుట్ట నర్సింలు, బక్క నర్సింలు, గడ్డమీది రాజు బక్క యాదయ్య పుల్లని భీమయ్య బక్క యాదగిరి శంకరి యాదగిరి చింతకింది సురేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మున్సిపల్ అధికారులపై హైకోర్టు మండిపాటు



మేడిపల్లి, ఏప్రిల్ 13 (ప్రజాపాలన ప్రతినిధి):ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హాబ్సిగూడ వివేకానంద నగర్లో ఉ ప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి సోదరుడు పి నర్సింహా రెడ్డి ఇంటి నెంబర్ 1-5-76 గల ఒక చిన్న ఆఫీస్ షెడ్ గత నెల 25 తేదీన శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నోటీసు ఇచ్చి 24 గంటలు గడవముందే శనివారం ఉదయం 7:30 నిమిషాలకు అగమెగల మీద పోలీసు సిబ్బంది వెంట పెట్టుకొని నిబందలలు పాటించకుండా అధికార పార్టీ ప్రతినిధికి అనుకూలంగా కూల్చివేత వ్యవహారంలో దూకుడుగా వ్యవహరించిన ఉప్పల్ సర్కిల్ మున్సిపల్ అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నోటీసులు ఇచ్చిన 24 గంటల తర్వాత చర్యలు తీసుకోవాల్సి ఉండగా ముందుగానే వెళ్లి కూల్చివేతలు చేపట్టిన అధికారుల తీరును కోర్టు తప్పు పట్టింది. సంబంధిత యజమానికి నష్టం జరిగితే పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. షెడ్ కూల్చివేత వ్యవహారంలో హైకోర్టు ఈ విధమైన ఆదేశాలు జారీ చేసింది. ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటరమణ, టి పి ఎస్ మౌనిక ల పై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

## కోత విధించిన వేతనాలు వెంటనే చెల్లించాలి



మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 13, ప్రజాపాలన : సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రి లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుండి పోరాటం ఫలితంగా మంగళవారం రోజున సదరు కాంట్రాక్టర్ 3 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించే క్రమంలో పూర్తిగా వేతనాలు చెల్లించకుండా అందులో ఒక వర్కర్ కి ఏకంగా 1500 నుండి 2000 రూపాయల వరకు కోత విధించడం సరికాదన్నారు. దింతో వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. ఇప్పటికైనా కోత విధించిన మొత్తం వేతనాలు వెంటనే వర్కర్లకు చెల్లించాలని అన్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమలు చేస్తామని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కుమార్, నరేష్, శిలా, సుమలత, దుబ్బమ్మ, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## కార్మిక సంఘాల జేఏసీ నాయకులకు ఏ ఎల్ సి కార్యాలయం నుండి పిలుపు



బెల్లంపల్లి ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి: మందమర్రి ఏరియా శాంతి ఖని గనిలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడు కందుల లక్ష్మీనారాయణ మృతిపై విచారణ జరిపించి, గని ప్రమాదంగా గుర్తించి, ఆయన కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా మృతుని కి సంబంధించిన అన్ని వివరాలతో ఈనెల 18వ తేదీన గోదావరిఖని ఎన్ టి పి సి లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం లో హాజరు కావలసిందిగా ఉత్తర్వులు పంపారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు .మంగళ వారం నాడు శాంతి ఖని గని పై జే ఏ సి ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ సమ్మాశంలో వారు మాట్లాడుతూ శాంతి ఖని లాంగ్వాల్ ప్రాజెక్టు గని అండర్ గ్రౌండ్ లో ఇటీవల చనిపోయిన కందుల లక్ష్మి నారాయణ అనే కాంట్రాక్టు కార్మి కుని మృతిని, గని ప్రమాదంగా గుర్తించాలని, అలాగే మృతుని కుటుంబానికి యాభై లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, మృతికి కారణమైన అధికారులపై పై విచారణ జరిపించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు నల్లబ్యాడ్జీలు ధరించి డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కార్మిక సంఘాల నాయకులు అండర్ గ్రౌండ్లో కందుల లక్ష్మీనారాయణ మరణించిన స్థలాన్ని పరిశీలిస్తామ ని విజ్ఞప్తి చేయగా, ట్రేడ్ యూని యన్ నాయకులు, కార్యకర్తలు, ఉ ంటే వారితో మిమ్మలను దిగడానికి అనుమతిస్తామని చెప్పి, దీనికి సంబంధిత నాయకులం కలిసి వెళ్ళగా వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ పర్మిషన్ రద్దు చేశాడని వారన్నారు. ఏజెంట్ తో కందుల లక్ష్మీ నారాయణ నుదిటిపై, శరీరంపై ఉన్న గాయాల గురించి చెప్పగా, అలాంటిది ఏమి లేదని దాదాపు 300 మంది కార్మికులు అతన్ని పరిశీలించారని,1000,మంది చూసారని,మీరుమాత్రం గాయం ఉ ందంటున్నారని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని అన్నారు. వాటికి సంబంధించిన ఆధారాలన్ని మా వద్ద కూడా సాక్షా ఆధారాలు ఉ న్నాయని వీటిని మేము 18 తారీకు నాడు ఏ ఎల్ సి.ముందు ఉంచుతా మని, వారన్నారు. సింగరేణి యాజ మాన్యానికి వాస్తవాలు కప్పిపు చ్చడం, నిజాల్ని మరుగుపర్చడం, తప్పుడు రిపోర్టులు తయారు చేయించడం, వెన్నతో పెట్టిన విద్య అని, కందుల లక్ష్మీనారాయణ మృతి వెనుక దాచిన నిజాన్ని బట్ట బయలు చేస్తామని వారు హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు,టి, మని రాంసింగ్, ఎస్.కె చాంద్ పాషా ఐ ఎ ఫ్ టి యు, సింగరేణి గని కార్మి క సంఘం నాయకులు అంబాల ఓదేలు, హెచ్ ఎం ఎస్ నాయకులు ఎండీ గౌస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధాన్యం కొనుగోలు చేసేలా చేసిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర

19వ రోజుకి చేరుకున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



బోనకల్, ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి: వరి వేస్తే ఉరి అని ప్రకటించిన పాలకుల పైన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పెంచిన వత్తిడితో వరి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడాన్ని రైతుల విజయంగా భావిస్తున్నట్లు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకై చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం 19 రోజున జానకిపురం నుంచి నారాయణపురం, చిన్న బీరవల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాల్లో (సుమారుగా 12 కిలోమీటర్లు) పాదయాత్ర కొనసాగింది. రాత్రి కలకోట గ్రామంలో బస చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభలలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడాతూ వరి వేస్తే ఉ రి అని ప్రభుత్వం ఆంక్షలు పెట్టడంతో రాష్ట్రంలో 15లక్షల ఎకరాలకు పైగా వరి వేయకుండా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వీరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అస్పష్ట విధానాలు రైతులకు శాపంగా మారాయని విమర్శించారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో వారి కొనుగోలు చేసినట్లు గానే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో కూడా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం కూడా అంతర్భాగమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు.

**కరెంటు చార్జీల భారం తో ప్రజలు విలవిల.....**

నిత్యావసర ధరలు పెంచి బిజెపి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తుంటే.. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా తెలంగాణ ప్రభుత్వం డెవలప్మెంట్ పేరిట కరెంటు చార్జీలను పెంచి ప్రజలపై భారాలు మోపడాన్నీ తీవ్రంగా ఖండించారు. నెలకు 450 రూపాయలు రావాల్సిన కరెంట్ బిల్లు ఈ నెల 12వేలు వస్తే ఎలా చెల్లిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఇదేవిధంగా పేదల పైన కరెంటు చార్జీల భారం మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలను, డెవలప్మెంట్ పేరిట వేస్తున్న అదనపు చార్జీల బాదుడుని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**భట్టి పాదయాత్రకు సంఘీభావం......**

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు బుధవారం వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఆంధ్ర ప్రదేశ్ పీసీసీ కార్యదర్శి మేడ సురేష్ లు బోనకల్ మండలం చిన్న బీరవల్లి గ్రామంలో స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. అక్కడి నుంచి బ్రాహ్మణపల్లి వరకు సీఎల్పీ నేత భట్టి అడుగుల్లో అడుగులు వేస్తూ పీపుల్స్ మార్చ్ లో కదం తొక్కారు.

**పాదయాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం.....**

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర కు బోనకల్ మండలం నారాయణపురం, చిన్న బీరవల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాల్లో కాంగ్రెస్, టిడిపి, వామపక్ష శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున కదిలివచ్చి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టి వీరతిలకం దిద్దారు. డప్పుల దరువు, కోలాటం మహిళల నృత్యాలతో పాదయాత్ర హోరెత్తింది. సబ్బండ వర్గాల ప్రజలు కదిలి వచ్చి భట్టి అడుగులో అడుగులు వేస్తూ పీపుల్స్ మార్చ్ లో కదం తొక్కారు. కాగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రజలను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ వారి సమస్యలను ఆలకిస్తూ యువత తో కరచాలనం చేస్తూ తన పాదయాత్రను ముందుకు కొనసాగించారు.













## మైనారిటీ సంక్షేమ పథకాల అమలుకై జిల్లా సంక్షేమ అధికారిని కలిసిన బెల్లంపల్లి ముస్లిం నాయకులు



బెల్లంపల్లి ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లాలో మైనారిటీ సంక్షేమ పథకాల అమలు, పై మైనారిటీ సంక్షేమ అధికారిని బుధవారం నాడు తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి చర్చించినట్లు , బెల్లంపల్లి పట్టణ మైనారిటీ నాయకులు తెలి పారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ జిల్లా మైనారిటీ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి, దావాత్ – ఏ – ఇఫ్తార్ మరియు రంజాన్ కానుకలు, ముఖ్య మంత్రి ప్రతిష్టాత్మకంగా ఇచ్చే, ఇమామ్, మౌజన్ ,ల గౌరవ వేతనం గురించి మాట్లాడం జరిగిందని, ఇట్టి విషయంలో మైనారిటీ అధికారిని సానుకూలంగా స్పందించారనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలోబెల్లంపల్లి మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఖాజా, మాజీ మున్సిపల్ కో – ఆప్షన్ మెంబర్ ఎండీ.నిజాముద్దీన్ , యునుస్ , ఖలీల్ , యూసుఫ్ , ఖదీర్ , తహెర్ , బాబుజాని , సాదిక్ , ఇమ్రాన్ , అన్వర్ , తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం: ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి :కేంద్రంలోని బిజెపి పాలకులు తెలంగాణ రైతులను వంచించినా , మీ ప్రజలకు నూకలు తినడం నేర్పండని వెక్కిరించినా , తెలంగాణ రైతులనుండి వడ్లు కొనేదిలేదని భీష్మించినా ... అన్నదాతను ఆగంకానిచ్చేది లేదు , అండగా ఉంటా .యాసంగి వడ్లు కొంటా .పల్లెపల్లెనా కొనుగోలు కేంద్రాలు పెడతామంటూ “ రైతుజనబాంధవుడు కేసీఅర్ ప్రకటించడంతో హర్షం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కెసిఆర్ గారి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన జిల్లా అధ్యక్షుడు , ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి, ఎంపీపీ కృపెష, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, మండల పార్టీ అధ్యక్షుడు చిలక బుగ్గ రాములు,యాచారం కార్యదర్శి పచ్చ భాష, మేడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, యాచారం రవీందర్, చెరుకూరి రవీందర్, మక్క పల్లి శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 8688810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| బాబురావు గొండ్ల | తల్లాడ మండలం | 9848236015 |
| డి.ప్రవీణ్ కుమార్ | కొడంగల్ | 9666027635 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |


## ముఖ్యమంత్రి కేసీఆర్ వేసంగి వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయటం రైతు ఆనందోత్సవం



మధిర ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో బుధవారం నాడు తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రైతు ఇచ్చిన హామీతో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోవంగవీడు లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం. ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి రైతు బాంధవుడిగా తెలంగాణ రైతులు కొనియాడుతున్నారు అని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తా రు నాగేశ్వరరావు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాస రావు పేర్కొన్నారు. బుధవారం వంగవీడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆ గ్రామ సర్పంచ్ బొగ్గుల పద్మావతి అధ్యక్షతన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వరి రైతులను మోసం చేసిందని వారి బాధ్యతను విస్మరించారని ఆరోపించారు. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో యాసంగి వరి ధాన్యాన్ని ప్రతి గింజ కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపి వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని కేసీఆర్ ప్రకటించడం పట్ల యావత్ రాష్ట్ర రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి దేశంలోనే కెసిఆర్ అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కనుమూరు వెంకటేశ్వరరావు మధిర సొసైటీ చైర్మన్ బిక్కి ప్రసాద్ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి రైతుబంధు మండల కన్వీనర్ చావా వేణుబాబు టిఆర్ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ కోన నరేందర్ రెడ్డి టిఆర్ఎస్ గ్రామ నాయకులు ఐలూరి జనార్ధన్ రెడ్డి బొగ్గుల వీరారెడ్డి, బండి వెంకటేశ్వర్లు సత్యనారాయణ రెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమం



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి : భారతీయ జనతా పార్టీఅధ్యక్షుడు బండి సంజయ్ పిలుపుమేరకు ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్యాల భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వరి ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రైతులకు పంటలు పండించే సమయంలో వారి వేయొద్దని హితవు పలికారు కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనాలని ఢిల్లీలో ధర్నా చేసిన నీవు ఈరోజు రాష్ట్రంలో తిరిగి మళ్ళీ వరి ధాన్యాన్ని మేమే కొంటామని రాష్ట్రంలో రైతులకు సూచనలు ఇస్తున్నావు ఈ రోజు కేంద్ర ప్రభుత్వం తో నువ్వు పెట్టుకుంటే రేపు రాబోయే రోజుల్లో నిన్ను పతనం చేయడమే బిజెపి భారతీయ జనతా పార్టీ నీకు బుద్ధి చెప్పడం ఖాయమని ముత్యాల భాస్కర్ అన్నారు అసెంబ్లీ కన్వీనర్ నాయిని సత్యనారాయణ మాట్లాడుతూ 7 ఏళ్ల పాలనలో నీవు ఒరగబెట్టింది ఏమీ లేదని గెలిచిన తర్వాత దళితుడిని ముఖ్యమంత్రి చేస్తాఅన్న నీవు మాట తప్పావు అంటూ ఎద్దేవా చేశారు. రైతుబంధు రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న ఏమైంది నీ పార్టీ వాళ్లకు ఒక్కొక్కరికి ఇస్తే సరిపోయిందా రాష్ట్ర ప్రజలు ఎంతో మంది దళితులు ఉన్నారు దమ్ముంటే దళితులు అందరికీ దళిత బంద్ కల్పించి వాళ్లకు భృతి కల్పించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. జక్క రవీందర్ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్ర లో దళిత ముఖ్యమంత్రి అని రైతుబంధు అని మూడెకరాల భూమి ఇస్తానని మాట నమ్మబలికి ప్రజలను మోసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ జక్క అన్నారు రంగారెడ్డి జిల్లాలో ధాన్యం అతి తక్కువ పండించే మండలాలు అబ్దుల్లాపూర్మెట్ మూసీ నది వాటర్ తో వస్తున్న పంట తక్కువ రేటుకు దళారీలు అడగడం రైతులు ఎలా బతకాలి పొద్దున్నే ఒక మాట పొద్దు పొడిచాక ఒక మాట మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తూ రైతులను అరిగోస పెడుతుండు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలి రైతులకు తగు న్యాయం కల్పించే అంతవరకు భారతీయ జనతా పార్టీ ప్రజలకు వెన్నంటి ఉండి పని చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండే%శీ% శ్రీశైలం , తాళ్ల వెంకటేష్, మొగిలి గణేష్, శాంతి దిలీప్ గౌడ్, బాల శివుడు గౌడ్ శ్రీకాంత్, వేణుగోపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చారి, మనోహర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

## రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు కు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి :తెలంగాణ రాష్ట్రంలో లో యాసంగి లో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు విషయమై కేంద్రం చేతులెత్తేసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిన్న జరిగిన కేబినెట్ సమావేశం లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్ నిర్ణయం తీసుకోవడం జరిగింది ఈ నిర్ణయానికి రైతులు తెరాస నాయకులు ఈరోజు ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ రైతు వేదిక వద్ద ఎంపీపీ క్రుపేష్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఉప్పరిగూడ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి రైతు బంధు సమితి అధ్యక్షులు మొద్దు అంజి రెడ్డి, మండల అధ్యక్షులు బుగ్గ రాములు గార్ల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి సభ్యులు కాయితి మోహన్ రెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపల్ టిఆర్ఎస్ అధ్యక్షులు అల్వాల వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహా రెడ్డి, తెరాస నాయకులు చెరుకూరి రవీందర్, బోసు పల్లి చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యులు మడుపు గోపాల్, పో రెడ్డి సురేందర్ రెడ్డి, తెరాస గ్రామ శాఖ అధ్యక్షులు నల్లోల రమేష్, నాయకులు ముద్దు వెంకట్ రెడ్డి ,నరకుడి శ్రీనివాస్, బోసు పల్లి హరికృష్ణ, సుధాకర్, మాడుగుల యాదిరెడ్డి, పాల్గొన్నారు.

## నేడు అన్నారుగూడెంకు పొంగులేటి రాక..

### రమేష్ ను పరామర్శించనున్న శ్రీనివాసరెడ్డి..



తల్లాడ, ఏప్రిల్ 13 (ప్రజాపాలన న్యూస్):తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి ఈనెల 14వ తేదీన ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి రానున్నారు. పొంగులేటి ప్రధాన అనుచరులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ మాతృమూర్తి సరస్వతమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పొంగులేటి రమేష్ ను పరామర్శించేందుకు రానున్నారు. ఉదయం 11:30 గంటలకు గ్రామానికి వస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు.

## రైతు బాంధవుడు ముఖ్యమంత్రి కెసిఆర్



పాలేరు ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి :ఖమ్మం జిల్లాతెలంగాణలో యాసంగి సీజన్‌లో రాష్ట్ర రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించడంపై తెలంగాణ ఉద్యమకారుడు, తెరాస జిల్లా నాయకులు బాదావత్ లక్ష్మణ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు డిల్లీలో ఒకమాట గల్లీలో ఒకమాట మాట్లాడి రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. కార్పొరేట్లకు, దొంగలకు పదిన్నర లక్షల కోట్లు మాఫీచేసిన కేంద్ర ప్రభుత్వం 60 లక్షల మంది రైతుల కోసం మూడున్నర వేల కోట్లు భరించలేకపోతున్నదని మండిపడ్డారు. కేంద్రం చెతులెత్తేసినా తెలంగాణ ప్రభుత్వం రైతులను విడిచిపెట్టలేదని రైతు పక్షపాతి అయిన ముఖ్యమంత్రి కెసిఆర్ రైతులను ఆదుకోన్నారని, పండిన ప్రతిగింజను మద్దతు ధర క్వింటాకు రూ.1960 వెచ్చించి కొనుగోలు చేస్తామని సీఎం ప్రకటించారని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కార్యాచరణను బుధవారం నుంచే యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయంపై తెలంగాణ వ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

## షాపుల యజమానులు ఈ నెలాఖరు వరకు ఆన్లైన్ లైసెన్స్ లు తీసుకోవాలి

### బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ జంపాల రజిత



బెల్లంపల్లి ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల దుకాణాల యజమానులు, ఏప్రిల్ నెల చివరి వరకు అన్ లైన్ లైసెన్సులు తీసుకోవాలని , తీసుకొని యెడల మునిసిపల్ చట్టం–2019 ప్రకారం వారిపై చర్య తీసుకోని వారి దుకాణమును “ సీజ్ “చేయబడునని బెల్లంపల్లి మునిసిపల్ కమీషనర్ జంపాల రజిత తెలిపారు.మంగళవారం నాడు పత్రికలకు ప్రకటన విడుదల చేశారు, దుకాణాల యజమానులు వారి వారి దుకాణపు కొలతలు, మరియు ట్రేడ్ లైసెన్స్, లు ఆన్లైన్ లేని యెడల దుకాణ యజమానులపై 25 రేట్ల వరకు అదనంగా పెనాల్టీ విధించడం జరుగుతుందని , అలాగే పురపాలక శాఖ కమిషనర్ , ఆదేశా లమేరకు బెల్లంపల్లి పట్టణంలో వ్యాపారం చేయుటకు, రహదారి వెడల్పు, వాణిజ్య కొలతల, ద్వారా లైసెన్స్ ఫీజు విధించబడునని తెలిపారు. . ప్రతి దుకాణం లో తడి, పొడి మరియు హానికర చెత్తను వేరు చేయుటకు డస్ట్ బిన్స్, ను ఏర్పాటు చేసుకోవాలని , ఏర్పాటు చేసుకోకపోతే, మునిసిపల్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు, డస్ట్ బిన్స్ లేక పోతే 1000 నుండి 5000 –వరకు పెనాల్టీ వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## గిరిజన పోరుగర్జన సదస్సును విజయవంతం చేయాలి: రాము నాయక్



బెల్లంపల్లి ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి: మేము ఎంత మంది మో, మాకంత వాటా కావాలి , అనే నినాదం తో, వాటా సాధన కోసం ఈ నెల 19 న హైదరాబాదులో జరిగే పోరు గర్జన సభకు గిరిజనులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, సేవాలాల్. సేన. జాతీయ ప్రధాన కార్యదర్శి, రాము నాయక్ పిలుపునిచ్చారు.బుధవారం నాడు ఆయన కాసిపేట మండలంలో ని , ధర్మారావు పేట లో తండా సర్పంచ్, తిరుపతి నాయక్, అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో గిరిజన పోరుగర్జన కరపత్రాన్ని విడుదల చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో మేము ఎంత మందిమి, ఉన్నామో, మాకు అంత వాటా కావాలనే నినాదంతో గిరిజన పోరుగర్జన సదస్సును ఏర్పాటు చేశామని, ఆ సదస్సు కి గిరిజన సోదరులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాము నాయక్ తో పాటు తిరుపతి నాయక్, దేవ్ సింగ్, హరిచంద్, తదితరులు పాల్గొన్నారు.


## ఫేర్వెల్ పార్టీ ఎంపీపీ ఎస్-మడుపల్లి హరిజనవాడ




మధిర ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నాడు మడుపల్లి హరిజనవాడ పాఠశాల యందు 5వ తరగతి విద్యార్థులు అందరూ కలిసి ఏడవ వార్డు కౌన్సిలర్ శ్రీమతి మేడికొండ కళ్యాణి కిరణ్ కుమార్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ లింగంపల్లి అప్పారావు సమక్షములో కేక్ కట్ చేయడం జరిగింది ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ గురువుల పట్ల గౌరవ భావంతో మెలగాలని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు బాలికలకు చేత పని వద్దు చదివే ముద్దు అనే నినాదం చెప్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు విద్యాభ్యాసం పూర్తి చేసి పాఠశాల విడిచి వెళుతున్న అందుకు బాధగా ఉన్నప్పటికినీ వారు పై తరగతుల్లో మంచిగా చదువుకొని హరిజనవాడ పాఠశాలకు మంచి పేరు తీసుకొని వస్తారని మంచి స్థాయికి ఎదగాలంటే కేవలం విద్య ప్రామాణికమని నొక్కి వక్కాణించారు ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయుని జి సుజాత మేడం , కమిటీ సభ్యులు రత్న బాబు , వి అశోక్ కుమార్ కూడా పాల్గొన్నారు అదేవిధంగా పాఠశాల సిబ్బంది మరియు అంగన్ వాడి పిల్లలు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ బ్యూరో 13 ఏప్రిల్ ప్రజా పాలన : మహిళల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టెంపల్లి సమీపంలో గల డిపిఆర్సి భవనంలో డిఆర్డిఎ ఆధ్వర్యంలో మహిళా సంఘాల వారికి సబ్సిడీపై అందిస్తున్న సీలింగ్ ఫ్యాన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సమైక్య సంఘాల ద్వారా గ్రామ స్థాయిలో మహిళలు కుటుంబ స్థితిగతులను చక్క దిద్దుతూ ఉన్నతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ కృష్ణన్, అదనపు పిడి నర్సింలు, జిల్లా సమైక్య అధ్యక్షురాలు మొగులమ్మ, డిపిఎంలు, ఎపిఎంలు మహిళా సంఘాల వారు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## సామాజిక కార్యకర్త

జిల్లా ప్రచారక్ శ్రీధర్‌జీకి జగిత్యాలలోని ధనవంతులు, పురప్రముఖులు ఎందరో పరిచయమయ్యారు. నేనే పరిచయం చేశాను. 60 రూ.లు వారినడిగి ఫీజు కడితే బాగుంటుందని ఆశించాను. కానీ ఆయన చివరి దాకా నన్నే డబ్బులు జమ చేసుకోమన్నాడు. నాతో కాలేదు. హెూటల్ మూసేసి, డిటెక్టివ్ పుస్తకాలు అమ్మేస్తే కొన్ని పైసలు వచ్చినై. ఆ పైసలు ఫీజు కట్టమన్నాడు శ్రీధర్‌జీ. అట్లా ఫీజు కట్టి నేను వెళ్ళడం నాకు ఇష్టమనిపించలేదు. ఇంతమంది ధనవంతులు ఉన్నప్పుడు ఈ కాస్త డబ్బు సాయం చేయనప్పుడు నేను ఓటీసి శిక్షణకు వెళ్ళడం దేనికి? పరస్పర సహకారం లేని దానికోసం నేనెందుకు ఇంత పేదరికంలో కష్టపడాలి అని ఫీలయ్యాను. సరస్వతీ శిశుమందిర్ అనే పేరు అప్పటికి ప్రాచుర్యంలో లేదు. ఆర్.ఎస్. ఎస్. తరఫున పాఠశాల ప్రారంభించాలని శ్రీధర్‌జీ, కల్లెపు విద్యాసాగర్‌జీ పదే పదే కోరారు. ప్రైవేటు పాఠశాల స్వంతంగా నడపడం పట్ల ధైర్యం చాలలేదు. పైగా పోస్టాఫీసులో క్లర్క్ ఉద్యోగం వస్తుందని ఎదురుచూస్తున్న వాడిని స్కూలు పెడితే మధ్యలో ఉద్యోగం వస్తే అది కూడా హెూటల్‌వలెనే నష్టంతో మూసేయాల్సి వస్తుంది. మా ఇంటి దగ్గరే ఒక ఇంగ్లీషు మీడియం స్కూలు అప్పుడే పెట్టి కొద్ది నెలలకే నష్టంతో మూసివేశారు. ఆ అనుభవం కూడా కళ్లెదుటే కనపడుతుంది. అందుకని నేను ఆ సరస్వతి శిశుమందిర్ ప్రారంభించలేకపోయాను. ప్రారంభించి ఉంటే తెలంగాణాలో అదే మొదటి స్కూల్ అయి ఉండేది. ఆ తర్వాత కొంతకాలానికి మిన్నేని విద్యాసాగర్‌రావు (సాగర్‌జీ) గీతా విద్యాలయం పేరిట పాఠశాలను ప్రారంభించాడు. ఆయన జగిత్యాల డిగ్రీ కాలేజీలో డిమోన్‌స్ట్రేటర్‌గా ఉన్న ఉద్యోగాన్ని వదిలివేసి పాఠశాలను ప్రారంభించాడు. ఆయన పేరు గీతా విద్యాలయం సాగర్‌జీగా స్థిరపడిపోయింది. ముగ్గురు సాగర్‌జీలు ఉండడంవల్ల గీతా విద్యాలయం సాగర్‌జీ, కల్లెపు విద్యాసాగర్‌జీ, చెన్నమనేని సాగర్‌జీ (మాజీ గవర్నర్)లను ఇలా కొత్త ఇంటిపేర్లు తగిలించుకునేవాళ్ళం. జగిత్యాలకు దక్షిణాన పోచంపాడు ప్రాజెక్టు మెయిన్ కెనాల్ పనికోసం ధరూర్‌క్యాంపు వెలసింది. పోచంపాడు తర్వాత అతిపెద్ద క్యాంపు కార్యాలయంలో అనేక తాత్కాలిక, వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగాలు ఉండేవి. కొందరు మిత్రులు టెంపరరీ మేస్త్రీగా వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయిగా అందులో చేరారు. ధరూర్ క్యాంపులో కూడా ఆర్.ఎస్.ఎస్. శాఖను ప్రారంభించడం జరిగింది. లింగంపేట లక్ష్మారెడ్డి, గీతావిద్యాలయం సాగర్‌జీ ఆ శాఖను నిర్వహిస్తుండేవాడు. కులాలు అడగడం అనే విషయం ఆరెస్సెస్‌లో వుండేది కాదు. పూర్తికాలం కార్యకర్తగా మారాక జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ప్రమోషన్ బాధ్యతలు పెరిగే క్రమంలో కులాలు, ఆర్థిక, సాంఘిక నేపథ్యం పరోక్షంగా పరిశీలించే వారని అంటారు. అయితే స్పష్టంగా కులం తాలూకు ఆచరణ ఎక్కడా కనపడేది కాదు. శాఖాహారాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చేవాళ్లు. అదంతా బౌద్ధానికి సంబంధించిన మంచిని హిందూ సంస్కృతి రూపంలో చెపుతున్నారనిపించేది. ఆర్.ఎస్.ఎస్. నాలుగు జిల్లాల విభాగ్ ప్రచారక్ 'అల్దేకర్‌జీ' జగిత్యాలకు వచ్చినప్పుడు వారం రోజులు ప్రచారం చేసి, మిత్రులను కలిసి మీటింగ్ ఆర్గనైజ్ చేశాము. సర్దార్ సత్రంలో (ప్రస్తుత వైశ్యభవన్)లో మీటింగ్ చక్కగా జరిగింది. ప్రాంత ప్రచారక్ సోంపల్లి సోమయ్య జగిత్యాల పర్యటనకు వచ్చినప్పుడు నేను, అలిశెట్టి మహారాజు (టీచర్), వాళ్ళ తమ్ముడు అలిశెట్టి లక్ష్మణ్ తదితరులం అహోరాత్రాలు కష్టపడి జనాన్ని సమీకరించాము. మీటింగు విజయవంత మైంది. అయితే ఆ రోజు ముందు రాత్రి నుండి కూడా నిద్రలేదు. తిండి సరిగా లేదు. ఏమీ తినకుండానే ఉదయం నుండి కార్యక్రమాల కోసం జన సమీకరణ కోసం తిరిగాను. మధ్యాహ్నం 3.30కు మీటింగ్, బైటక్ అయిపోయాయి. అన్నం తినడానికి వెళ్తామని నేను, సుప్రసిద్ధ ఆర్టిస్ట్, టీచర్ అయిన అలిశెట్టి మహారాజు, వాళ్ళ తమ్ముడు, నాకు సీనియర్ అయిన అలిశెట్టి లక్ష్మణ్ అడిగాము. చిన్న విషయాలే గానీ, వేసిన ప్రభావం ఇప్పటికీ మరచిపోలేను. మా ఇంటి సమీపంలో గల రాజకిషన్‌రావు అడ్వకేట్ ఇంట్లో సోంపల్లి సోమయ్య, శ్రీధర్‌జీ, కల్లెపు విద్యాసాగర్‌జీలకు భోజనాలు ఏర్పాటు చేశారు. వాళ్ళు భోంచేశాక ఇంకా మాట్లాడుకునేది ఉంది అని మమ్మల్ని బలవంతంగా ఆపారు. అప్పటికే నిస్సత్తువగా ఉంది. ఏం చెప్పినా చెవికెక్కే దశ కాదు. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. బలవంతంగా కూర్చోబెట్టారు. కమ్మని రుచుల వాసనతో మాకు మరింత ఆకలి అనిపించింది. వాళ్లు సుష్టుగా భోంచేశాక మళ్ళీ మాతో గోష్ఠి ప్రారంభించారు. ఎదుటి వారి ఆకలి గమనించని వాళ్ల పట్ల చాలా కోపం వచ్చింది. బాధ కలిగింది. ఆ అడ్వకేట్ మా కోసం కూడా భోజనాలు అరేంజ్ చేయాల్సింది. చేయలేదు. చేయనప్పుడు మమ్మల్ని తినిరమ్మనాల్సింది. మమ్మల్ని అలా వదలి పెట్టలేదు. దాంతో కలిగిన బాధ, కలిగిన అనుభవం దశాబ్దాల తరబడి వెన్నాడింది.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

# బడ్డీకొట్ల తొలగింపు.. ఫలించని రాస్తారోకోలు, ధర్నాలు



మధిర ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాల్టీ పరిధిలో బుధవారం నాడు అధికారుల తో బడ్డీ కొట్లు తొలగింపు కార్యక్రమం బడ్డీ కొట్టు కోల్పోయిన వారు లబోదిబో అంటూఅధికారులు ప్రజలు ప్రజాప్రతినిది నీటికొటిమీద రాతలలా నేతల హామీలు.ప్రత్యామ్నాయం చూపకుండానే బడ్డీకొట్ల తొలగింపుఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ వందల కుటుంబాలుమధిరలో బడ్డీకొట్లను తొలగించటంలో అధికారులు పంతం నెగ్గించుకున్నారు. అఖిలపక్ష పార్టీలతో ధర్నాలు,రాస్తారోకోలు చేసినా చిరు వ్యాపారుల ప్రయత్నం ఫలించలేదు.న్యాయం చేస్తాం,ప్రత్యామ్నాయం చూపిస్తాం అన్న నేతల మాటలు నీటి మీద రాతలలాగా అదృశ్యమయ్యాయి.దీంతో వందల బడుగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.మధిర నుండి ప్రాథినిద్యం వహిస్తున్న సిఎల్పీ నేత భట్టి విక్రమార్క,జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల రాజులు వ్యాపారులకిచ్చిన హామీలు నెరవేరలేదు.దాదాపు 40 ఏళ్ళ నుండి ఉపాధి మార్గాన్ని ఎంచుకొని వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివిస్తూ,ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేస్తూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారుల కుటుంబాలు అర్ధాంతరంగా రోడ్డునపడ్డాయి.కనీసం ప్రత్యామ్నాయ మార్గం చూపించలేదు.కొంతమంది అధికారుల పంథానికి వందల కుటుంబాల ఉపాధి మార్గాలు దెబ్బతిన్నాయి.బడ్డీకొట్ల తొలగంపు వ్యవహారంలో ఇప్పటికీ ఏఒక్క అధికారి పేరుతో ఆర్డర్ కాపీ లేకుండా కేవలం మౌఖిక ఆదేశాలతోనే తొలగిస్తున్నట్లు వినికిడి.మధిరలో ట్రాఫిక్ సమస్యలు ఉన్నది నిజమే అయినా కొన్ని నిబంధనలతో వాటిని పరిష్కరించవచ్చు కానీ ఉన్నపళంగా బడ్డీకొట్లను తొలగించి వారి ఉపాధి మార్గాన్ని నాశనం చేయటం వ్యవస్థాపరమైన లోపం.మధిర మెయిన్ రోడ్డులో డ్రైనేజి కాలువలు,నాళాలు ఆక్రమించి నిత్యం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లగించిన బడా వ్యాపారులపై చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిబద్ధతపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా చిరు వ్యాపారుల ఆర్తనాదాలు మధిరలో ఉన్న ఏఒక్క నేత,అధికారిగానీ చివరకు ఏ దేవుడూ ఆలకించనే లేదు. బడ్డీకొట్టు జీవనాధార పైప్రజాప్రతినిధులుఆలోచించుకోబడుగుల నోటికాడ బువ్వలాక్కున్న ఏ ఒక్కరూ బాగుపడరూకొందరి శాపనార్ధాలూ ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు కోరుకుంటూ తెలిపారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలి: పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు



మధిర ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నాడు టీవీ ఎం హరిజనవాడ ఉన్నత పాఠశాలలోమారుతున్న పరిస్థితులకు తగ్గట్లు ఉపాధ్యాయులు కూడా తమ బోధనా నైపుణ్యాలను మరింతగా మెరుగుపరుచుకోవాలి.పి ఆర్ టి యు జిల్లా ప్రధానకార్యదర్శి %=%రంగారావుప్రభుత్వ విద్యారంగాన్ని మరింతగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ,ఉపాధ్యాయుల పైన కూడా ఉందని పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి %=%.రంగారావు పేర్కొన్నారులి.మధిర లోని టీవీ ఎంహరిజన వాడ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ శిక్షణా తరగతులను సందర్శించి ప్రసంగించారు.ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగం మీద చిత్త శుద్ధి తో దృష్టి పెట్టాలని ,ఉపాధ్యాయ ప్రమోషన్స్,నియామకాల ద్వారా ఖాళీ పోస్టులన్ని భర్తీ చేయాలని,ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులపై మరింతగా దృష్టి సారించాలని అప్పుడే పేద,మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.విద్యారంగం లో ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణం గా ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకుని విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని,ప్రభుత్వ పాఠశాలలు మరింతగా బలోపేతం కావడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని పిలుపునిచ్చారు.ఉపాధ్యాయ పరస్పర బదిలీల్లో సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించినప్పుడే ఉపాధ్యాయులకు న్యాయం జరిగిద్దని పేర్కొన్నారు.317 జి.ఓ ద్వారా ఇబ్బందులు పడుతున్న స్పౌజ్ మరియు ఇతర ఉపాధ్యాయులకు ప్రభుత్వం త్వరగా వారి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని పేర్కొన్నారు.రంగారావు వెంట పి ఆర్ టి యు రాష్ట్ర బాధ్యులు %వా%.వెూహన్రెడ్డి,%ఖ%.జయరాజు,జిల్లా బాధ్యులు కొమ్ము.శ్రీనివాసరావు ,నాయకులు కొలగాని.ప్రసాదరావు,ఎం.డి.జమీర్,పి.సుధాకర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



బోనకల్, ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవాన్ని బోనకల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు,బదిలీలకు వెంటనే షెడ్యూల్ ప్రకటించి ఈ వేసవి సెలవుల్లోనే నిర్వహించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ. రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వకపోవడం వలన వేలాదిమంది ఉపాధ్యాయులు ఒకే కెడర్ లో పనిచేస్తూ నిరాశగా ఉన్నారని, నిస్పృహలతో ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు.కావున, ప్రభుత్వం వెంటనే పదోన్నతులు చేపట్టాలన్నారు.ఏడు వేల కోట్ల రూపాయలతో మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన అన్నారు.ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చిత్త శుద్ధితో అమలు చేయాలని,కేవలం పాఠశాలల మౌలిక వసతుల కల్పనే గాకుండా ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, కేవలం బడులకి రంగులు వేసినంత మాత్రాన సరిపోదని ఆయన అన్నారు.టీఎస్ యుటిఎఫ్ నికరంగా ఉపాధ్యాయుల పక్షాన పోరాడే సంఘమని, రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం సంఘాలన్నీ ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని, జూన్ లో పాఠశాలలు ప్రారంభం నాటికీ నియామకాలు సాధ్యం కాకపోతే ఆ స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్సులు బి.ప్రీతమ్,గుగులోత్ రామకృష్ణ,మండల నాయకులు కె.రమేష్,పి.గోపాలరావు,ఏ. అనిల్ కుమార్, పి.నరసింహారావు,పుల్లారావు,,సీనియర్ నాయకులు, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు లెవిన్ పిల్లలమర్రి.అప్పారావు, సదా.బాబు,అరుణకుమారి,లక్ష్మీ, మంజూష,అనిత,పద్మావతి,నారాయణ,శ్రీనివాస్,లవకుశ,కేజీబీవీ,గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అధికార అహంకారంతో విధ్వంస కాండ



మధిర ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నాడుబట్టికోట్లకు తీసేయడం అధికార అహంకారంతో ఎట్టి అవసరం లేకున్నా తగిన ప్రత్యామ్నాయం చూపకుండా భయభ్రాంతులకు గురిచేసి నిస్సా సహాయులను చేసి మానవత్వం చూపకుండా మానవ హక్కులను భంగపరుస్తూ సంసత్సరాల తరబడి చిరువ్యాపారాలు చేసుకొంటున్న బడ్డీకొట్ల వారి బ్రతుకు దెరువుగావున్న బడ్డీకొట్లను ఉన్నతాధికారుల ఆదేశాల పేరుతో మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుండి 3.5 లక్షల రూపాయలు తొలగింపుకు కేటాయించి ఈరోజు ప్రోకలేన్లు తో తొలగించి చిరు వ్యాపారుల జీవణిపాధికి కోలుకోలేని దెబ్బ తీయటాన్ని తెలుగుదేశం పార్టీ ఖండిస్తున్నది. ఈ ఖమ్మం జిల్లాలో ఈ విషయానికి సంబంధించి ప్రజా ప్రతినిధుల సూచనలకు దమ్మిడీ విలువ ఇవ్వకుండా ఈ విధ్వంస కార్యక్రమం పూర్తి చేయటం కడు శోచనీయమైనదని తెలుగుదేశం ప్రకటిస్తున్నది నష్టపోయిన వారికి తగిన నష్ట పరిహారం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని , వారి జీవనోపాధికి ప్రత్యామ్నాయాలు వెంటనే చూపించాలని తెలుగుదేశం డిమాండ్ చేస్తున్నది

## వేసవి దాహార్తి తీర్చిన ఆరో వార్డు మునిసిపల్ కౌన్సిలర్ వరలక్ష్మి ఓంకార్



మధిర ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి :మున్సిపాలిటీ పరిధిలోని బుధవారంం నాడు అన్నాయిపాలెం గ్రామములో వేసవి లో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆదేశానుసారం మున్సిపాలిటీ చైర్ పర్సన్ మరియు కమిషనర్ సూచనల మేరకు మధిర మున్సిపాలిటీ ఆరో వార్డు నందు కౌన్సిలర్ వరలక్ష్మి ఓంకార్ బోరు భావి వేయించారు మరియు రోడ్డుకు ఇరువైపుల ముళ్ళకంప, పిచ్చి మొక్కలను జెసిబి తో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వార్డు ఇన్చార్జి ఓంకార్ విజయ్ కుమార్ శ్రీను అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## బడ్డీ కొట్లు తొలగించటం దుర్మార్గమైన చర్య

**అధికారుల చర్యలను ఎండగట్టిన కాంగ్రెస్ నాయకులు వేమి రెడ్డి శ్రీనివాస రెడ్డి కౌన్సిలర్ కోన ధని కుమార్**



మధిర13 ఏప్రిల్ ప్రజా పాలన పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో చిరువ్యాపారులకు సంబంధించి బడ్డీ కొట్లు తొలగింపు దుర్మార్గమని కాంగ్రెస్ నాయకుడు వేమి రెడ్డి శ్రీనివాస రెడ్డి కౌన్సిలర్ కోనా ధని కుమార్ మండల ఐఎన్‌టియుసి అధ్యక్షుడు కోరం పల్లి చంటి పేర్కొన్నారు. బుధవారం మధిరలో బడ్డీ కొట్లు తొలగింపు విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరును వారు వ్యతిరేకించారు కనీసం సమయం ఇవ్వకుండా ట్రాఫిక్కి ఇబ్బందులు లేని బడ్డీ కొట్లను సైతం తొలగించటం సరైన పద్ధతి కాదన్నారు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం సూచించిన తర్వాతనే బడ్డీ కొట్లు తొలగిస్తామని హామీ ఇచ్చిన అధికార పార్టీ నేతలు వ్యాపారులకు ఎటువంటి ప్రత్యామ్న్యాయం చూపించకుండానే తొలగించడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు.

## బడ్డీ కోట్లను తొలగించి పేదల బతుకులు బజారున పడేశారు



మధిర ఏప్రిల్ 13న ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు వార్డు కౌన్సిలర్ కలిసి బడ్డీ కొట్టు తీయటం అధికారదాహంతో ప్రజల బతుకులు చెలగాటం ఆడటం అతిత్వరలోనే టైం దగ్గర పడుతోందని ప్రభుత్వం హెచ్చరిస్తూ పేద ప్రజలు జీవనాధారం కోసం బడ్డి కోట్లు పెట్టొకొని చిరు వ్యాపారం చేసుకుంటూ వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతుంటే, కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా జెసిబి లు, క్రేన్లు, ట్రాక్టర్లతో యుద్ధవాతావరణం నెలకొల్పి పోలీసులతో దౌర్జన్యంగా,ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ బడ్డీ కోట్ల తొలగించటం హేయమైన చర్య.. మేము తొలగించుకుంటామ్ అంటే కూడా సమయం ఇవ్వకుండా బడ్డి కోట్లను పగులగొట్టి ట్రాక్టర్లలో వేసుకొని వెళ్తున్నారు దీనికి పూర్తిగా అధికార పార్టీ ఏ బాధ్యత వహించాల్సి ఉంటుందని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంసెట్టి కిషోర్‌అన్నారు.

## చోప్పకట్లపాలెం లో అధిక విద్యుత్ బిల్లుల మోత

**విద్యుత్ శాఖ అధికారులను అడగగా పట్టించుకోని వైనం**



బోనకల్,ఏప్రిల్ 13 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో అధిక విద్యుత్ బిల్లుల మోత కు విద్యుత్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన నంజాల నాగేశ్వరరావు ఇంటికి ఏప్రిల్ నెల కు గానూ విద్యుత్ రీడింగ్ తీయగా 19567 రూపాయలు బిల్లుగా వచ్చింది. సామాన్య కుటుంబానికి చెందిన నాగేశ్వరరావు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు పొలం పనులకు వెళ్తుంటారు. ఇంటిలో కూడా విద్యుత్ ఆధారిత లోడ్ పడే గృహెూపకరణాలు ఏమీ లేవు. ఇదేమిటని విద్యుత్ శాఖ అధికారులను నాగేశ్వరరావు ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు. గతంలో ఎన్నడూ 300, 400 రూపాయలు మాత్రమే బిల్లు వచ్చేదని ఇప్పుడు ఏకంగా 20వేల రూపాయలు రావడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు. గ్రామంలో కూడా ఇలా చాలా మందికి అధిక బిల్లులు వచ్చాయన గ్రామ ప్రజలు వాపోతున్నారు.

## పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు సంఘీభావం తెలిపిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం

**నారాయణపురం తెలుగుదేశం గ్రామ శాఖ ఘన స్వాగతం**



బోనకల్ ఏప్రిల్ 13 ప్రజాపాలన ప్రతినిధి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం మధిర శాసనసభ్యులు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చేరుకున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, నారాయణపురం తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ,మరియు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, సాధినేని హనుమంతరావు, తెలుగు యువత కార్యదర్శి మైనేని రవికుమార్, మండల కార్యదర్శి మరీదు బరకయ్య,నారాయణ పురం గ్రామ శాఖ అధ్యక్షుడు చావా హనుమంతరావు, తెలుగుదేశం నాయకులు సూర్యదేవర అప్పారావు ,తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జెంటిల్మాన్ 2" లో మరో యంగ్ హీరోయిన్ ఫిక్స్..!



ఇండియాస్ జేమ్స్ కేమరూన్ శంకర్ తెరకెక్కించిన భారీ హిట్ సినిమాల్లో యాక్షన్ కింగ్ అర్జున్ తో తీసిన బ్లాక్ బస్టర్ సోషల్ డ్రామా "జెంటిల్మాన్" సినిమాకి గాను ఆ సినిమా నిర్మాత కుంజుమోన్ సీక్వెల్ ని పాన్ ఇండియా లెవెల్లో భారీ బడ్జెట్ తో తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. మరి గత కొన్నాళ్ల నుంచి ఒక్కో అప్డేట్ ని మేకర్స్ రివీల్ చేస్తూ వస్తుండగా నిన్ననే ఈ సినిమాలో మరో హీరోయిన్ ఎవరో అనేది రివీల్ చేస్తున్నట్టుగా అప్డేట్ ఇచ్చారు. మరి ఇప్పుడు ఆ హీరోయిన్ ని కూడా అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో మరో హీరోయిన్ గా యంగ్ నటి ప్రియా లాల్ ని తీసుకొచ్చినట్టు తెలిపారు. మరి ప్రస్తుతానికి అయితే ఈ భారీ సినిమాకి అంతా కొత్త క్యాస్టింగ్ నే తీసుకొస్తున్న చిత్ర యూనిట్ మున్ముందు హైప్ కి ఎలాంటి క్యాస్ట్ ని తీసుకొస్తారో చూడాలి. మరి ఈ సినిమాకి అయితే ఎం ఎం కీరవాణి సంగీతం అందివ్వనున్న సంగతి తెలిసిందే.

# ఓటీటీలో మరో ఆసక్తికరమైన వెబ్ సిరీస్ 'గాలివాన'



ప్రస్తుతం డిజిటల్ ఫ్లాట్ ఫార్మ్స్ హవా నడుస్తున్న నేపథ్యంలో ప్రేక్షకులను అంతులేని వినోదాన్ని అందించేందుకు ఓటీటీలన్నీ పోటాపోటీగా ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్ ను స్ట్రీమింగ్ పెడుతున్నాయి. ఇటీవల కాలంలో తెలుగు మీద ప్రత్యేక దృష్టి పెట్టిన జీ5 ఓటీటీ.. సూపర్ హిట్ సినిమాలు - ఒరిజినల్ వెబ్ సిరీస్ లతో దూసుకుపోతోంది. ఈ మధ్య కాలంలో జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' 'లూజర్ 2' వంటి పలు తెలుగు వెబ్ సిరీస్ లకు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ క్రమంలో లేటెస్టుగా "గాలివాన" అనే మరో ఇంట్రెస్టింగ్ ఒరిజినల్ సిరీస్ ని అందుబాటులోకి తీసుకొస్తోంది. అలనాటి నటి రాధికా శరత్ కుమార్ - డైలాగ్ కింగ్ సాయికుమార్ ప్రధానపాత్రధారులుగా రూపొందించబడిన 'గాలివాన' వెబ్ సిరీస్ ఈరోజు అర్ధరాత్రి (ఏప్రిల్ 14) నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ - ట్రైలర్ ఈ సిరీస్ పై ఆడియన్స్ లో ఆసక్తి కలిగించాయి. జంట హత్యల మిస్టరీ నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా 'గాలివాన' సిరీస్ ను రూపొందించినట్లు ప్రమోషనల్ కంటెంట్ చూస్తే అర్థం అవుతుంది. ఇందులో రెండు ఫ్యామిలీల మధ్య ఎమోషన్స్ తో పాటు సస్పెన్స్ - క్రైమ్ థ్రిల్లింగ్ అంశాలు మిళితమై ఉన్నాయి. గతంలో అనేక క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చినప్పటికీ.. 'గాలివాన' లో మాత్రం సెంటిమెంట్ తో కూడిన క్రైమ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఎమోషనల్ గా కనెక్ట్ అయ్యేలా చేస్తాయని భావించవచ్చు. గౌరా హరి సమకూర్చిన బ్యాగ్రౌండ్ స్కోర్ - సినిమాటోగ్రాఫర్ సుజాత సిద్దార్థ్ అందించిన విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. "గాలివాన" వెబ్ సిరీస్ కు 'తిమ్మరుసు' ఫేమ్ శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ సమర్పణలో బీబీసీ స్టూడియోస్ మరియు నార్త్ స్టార్ బ్యానర్స్ పై సమీర్ గోగాటే - శరత్ మరార్ సంయుక్తంగా ఈ ఒరిజినల్ సిరీస్ ను నిర్మించారు. ఈ సిరీస్ తో బిబిసి రీజనల్ ఎంటర్టైన్మెంట్ లోకి అడుగు పెడుతోంది. ఇందులో చాందినీ చౌదరి - చైతన్య కృష్ణ - అశ్రిత వేముగంటి - నందిని రాయ్ - తాగుబోతు రమేశ్ - శరణ్య ప్రదీప్ - అర్మాన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎన్నో విజయవంతమైన సినిమాల్లో సీరియల్స్ లో నటించిన రాధికా శరత్ కుమార్ కు ఇది ఓటీటీ డెబ్యూ. మరి 'గాలివాన' వెబ్ సిరీస్ ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి.
































Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989